ప్రజాశక్తి

ఆదివారం 17 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అదే స్థలం.. అదే వివాదం..!

రైల్వే జోన్‌కు పునాదిరాయి పడేనా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల ఏళ్ల నాటి ఆకాంక్ష. బిజెపి 2014 ఎన్నికల హామీ కూడా అదే. కానీ వాస్తవంలో ఇప్పటి వరకూ జోన్‌కు ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఈ ఏడాది డిసెంబరు పునాదిరాయికి డెడ్‌లైన్ కాగా జోన్ కార్యాలయ శంకుస్థాపనకు స్థలాన్నే పెద్ద వివాదంగా చూపిస్తూ కూటమి నేతలు కుంటిసాకులతో నేడు నెట్టుకొస్తున్నారు. నిజం చెప్పాలంటే.. ముడసర్లోవ వద్ద రైల్వే జోన్‌కు 52 ఎకరాల స్థలం ఏనాటి నుంచో సిద్ధంగా ఉంది. ఆ స్థలం సరైంది కాదని 2024 ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీలైన బిజెపి, టిడిపి అగ్రనేతలు వైసిపి ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. అంతకుముందు సంగతిని పరిశీలిస్తే.. 2022 నవంబర్ 15న గత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రైల్వే డిఆర్‌ఎం కార్యాలయానికి లేఖ రాస్తూ భూమి సిద్ధంగా ఉందని, జివిఎంసి చేపట్టే సర్వేలో పాల్గొనాలని కోరారు. ఈ క్రమంలో రైల్వే శాఖ తమకు క్లియర్‌గా బౌండరీ వేసి భూమిని అప్పగించాలని డిమాండ్ చేసింది. అయితే, ముడసర్లోవలోగల 52 ఎకరాలకు ఎలాంటి ప్రహరీని జివిఎంసి వేసి ఇవ్వకుండానే తాజాగా అదే స్థలంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ నవంబర్‌లో రైల్వేజోన్‌కు పునాదిరాయి వేస్తారంటూ తాజాగా ఈ పార్టీల నేతలు చెప్పడం చూస్తే కూటమి నేతల ద్వంద్వ వైఖరి వెల్లడవుతోంది.

ముడసర్లోవలోని స్థలం (ఫైల్ ఫొటో)

స్థల వివాదం ఒక సృష్టే ?

నగరంలోని ముడసర్లోవ రిజర్వాయర్‌కు సమీపంలో 52 ఎకరాల స్థలం రైల్వేకు ఉంది. ఇక్కడ దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయ భవనం నిర్మాణం చేసేందుకు రైల్వే అధికారులు కేంద్రానికి పంపిన డిపిఆర్‌లో వివరాలు పేర్కొన్న విషయం తెలిసిందే. విశాఖలో బిఆర్‌టిఎస్ కోసం రైల్వే నుంచి 26 ఎకరాలను జివిఎంసి తీసుకోగా అందుకు బదులుగా సర్వే నెంబరు 57 నుంచి 59 పి, 61 పి, 62 పి, 63, 64, 65ల్లో 52 ఎకరాలను ముడసర్లోవలో కేటాయించింది. 2018లో తొలిసారి రైల్వే అధికారులు ఈ స్థలంలో కంచె వేసేందుకు వెళ్లగా 20 ఎకరాల్లో నివాసం ఉంటున్న గిరిజనులు అడ్డుతగిలారు. మిగతా 30 ఎకరాల మేర భూమి క్లియర్‌గానే ఉన్నా జోన్ భవన నిర్మాణానికి రైల్వేకు కేంద్రం అనుమతులు మంజూరు చేయలేదు. 2014లోనే ఈ స్థలానికి సంబంధించి రైల్వే, జివిఎంసి మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం బౌండరీ వేసి రైల్వేకు అప్పగించాల్సి ఉంది. 2024 ఎన్నికల్లో గెలిచి ఐదు నెలలు దాటుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, జివిఎంసి ఇంకా ఆ పని చేయలేదు.

ప్రధాని పునాదిరాయి సమాచారం లేదు : రైల్వే

నవంబర్‌లో ప్రధానమంత్రి మోడీ వచ్చి ముడసర్లోవలో మిగతా 2లో..

18, 19న వ్యవసాయ రంగంపై సదస్సు

- దక్షిణాది రాష్ట్రాల నుంచి 70 మంది నిపుణులు, అధికార ప్రతినిధుల రాక
- పటిష్ట ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 18, 19 తేదీల్లో విశాఖపట్నం వేదికగా కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ప్రాంతీయ సదస్సు జరగనుందని, దీనికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సదస్సు ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, కేంద్ర, రాష్ట్రాల వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఆయన శనివారం స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, నిర్వహిస్తున్న కార్యక్రమాలు, చేపడుతున్న ప్రాజెక్టులు తదితర అంశాలపై ఈ సదస్సు జరుగుతుందని, దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి నుంచి వ్యవసాయ రంగ నిపుణులు, అధికార ప్రతినిధులు సుమారు 70 మంది భాగస్వామ్యం కానున్నారని తెలిపారు. 18న స్థానిక రాడిసన్ బ్లూ హోటల్‌లో వ్యవసాయ రంగంలో కొత్త ఆవిష్కరణలు, సంస్కరణలు, నూతన వంగడాలు, నూతన వ్యవసాయ విధానాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై చర్చ ఉంటుందని, భవిష్యత్తు కార్యాచరణపై మేధోపరమైన చర్చ సాగుతుందని పేర్కొన్నారు. 19వ తేదీన భీమిలి మండలం మజ్జిపేట గ్రామంలో వ్యవసాయ రంగ నిపుణులు, అధికారులు క్షేత్ర స్థాయి పర్యటన చేస్తారని, ప్రకృతి వ్యవసాయ విధానాలు, ఇతర విధానాల ద్వారా పంటల సాగును పరిశీలిస్తారని వివరించారు. అదే గ్రామంలో వివిధ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన ఉంటుందని, డ్రోన్‌ల వినియోగం, ఆవశ్యకతను తెలిపే విధంగా డెమో ఉంటుందని వెల్లడించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం వహించి రెండు రోజుల సదస్సును విజయవంతం చేయాలన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే అతిథులను ఆహ్వానించేందుకు, సహకరించేందుకు మిగతా 2లో..

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తోపుడుబండ్ల కార్మికులపై దాడులు ఆపాలి

వార్త 8లో..

ఎఫ్‌పిపిసిఎ ప్రతిపాదనలు తిరస్కరించాలి : సిపిఎం

వార్త 5లో..

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

వార్త 3లో..

ఉచిత డిఎస్‌సి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పోటీ పరీక్షల్లో విజయం సాధించే దిశగా సన్నద్ధత ఉండాలని, ప్రయత్నాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యలో విరమించకూడదని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ డిఎస్‌సి అభ్యర్థులను ఉద్దేశించి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, బిసి, ఇబిసి తరగతులకు చెందిన అభ్యర్థులకు ఎంవిపి.కాలనీలోని బిసి స్టడీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత డిఎస్‌సి శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకొని కష్టపడి చదివితే సానుకూల ఫలితాలు వస్తాయన్నారు. శిక్షణ కాలంలో 75 శాతం హాజరు ఉన్న అభ్యర్థులకు నెలకు రూ.1500 స్టైఫండ్, డిఎస్‌సి మెటీరియల్ కోసం రూ.1000 అందజేస్తామని వివరించారు. నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా ప్రిపరేషన్ కొనసాగించాలని, వర్తమాన అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బిసి సంక్షేమ అధికారిణి శ్రీదేవి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి రామారావు పాల్గొన్నారు.

సిఐటియు పోరాటంతో..

పూర్ణామార్కెట్ చిరు వ్యాపారులకు లబ్ధి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలో గుర్తింపు పొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ పూర్ణా మార్కెట్‌లో చిరు వ్యాపారులకు సిఐటియు పోరాటం కారణంగా గత ఆశీలు కాంట్రాక్టర్ దోపిడీకి చెక్ పడింది. కొత్తగా ఆశీలు కాంట్రాక్టు పాడుకొన్న వ్యక్తి చిరు వ్యాపారుల వద్ద నుంచి, అలాగే మార్కెట్లో ఇతర వ్యాపారుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం ఆశీలు వసూలు చేస్తుండడం పట్ల చిరు వ్యాపారులు హర్షం వెలిబుచ్చుతున్నారు. తమ పక్షాన పోరాడిన సిఐటియు చిరువర్తకుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావుకు వారంతా కృతజ్ఞతలు మిగతా 2లో..

సమస్యలపై అంగన్‌వాడీల ధర్నాలు

విశాఖలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్

మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, 42 రోజుల సమ్మె మినిట్స్ ఒప్పందాన్ని అమలు చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శనివారం అంగన్‌వాడీలు ధర్నాలు నిర్వహించారు. గత ఒప్పందాలను అమలు చేయాలని పెద్దపెట్టున నినదించారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి డిమాండ్ చేశారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన ధర్నాకు ఆమె మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం అంగన్‌వాడీల యూనియన్‌తో చేసుకున్న ఒప్పందాలను ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కష్టపడి పనిచేసే అంగన్‌వాడీలకు జీతాలు పెంచేందుకు డబ్బు లేదని చెబుతున్న అధికార పార్టీలోని పెద్దలు మాత్రం పెద్ద మొత్తంలో నెలనెలా జీతాలు తీసుకుంటున్నారని విమర్శించారు. పాలకులు తీసుకునే జీతాలతో పోలిస్తే అంగన్వాడీ వర్కర్లకు ఇచ్చే జీతాలు అతి స్వల్పమన్నారు. పాలకుల నిర్లక్ష్యంపై అంగన్‌వాడీలు పోరాడితేనే హక్కులు, హామీలు అమలవుతాయన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల మిగతా 2లో..

అనకాపల్లిలో మాట్లాడుతున్న నాగశేషు

మొదటి పేజీ తరువాయి..

సమస్యలపై అంగన్‌వాడీల ధర్నాలు

నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక పార్టీ పాలన పోయి మరొక పార్టీ పాలన వచ్చినా విధానాల్లో మార్పులేమీ ఉండవన్నారు. పొరుగున ఉన్న శ్రీలంకలో వామపక్ష ప్రభుత్వం ఏర్పడిన విధంగా మన రాష్ట్రంలోనూ వామపక్ష ప్రభుత్వ పాలన వచ్చే విధంగా అంగన్వాడీ వర్కర్లు, ఇతర సంఘాలలో ఉన్న వర్కర్లు ముందు కుటుంబాలలో, తర్వాత ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు అవుతున్నప్పటికీ అంగన్‌వాడీలకు మేలు జరిగే ఒక్క పని కూడా చేయలేదన్నారు. బడ్జెట్‌లో ప్రస్తావనే కరువైందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటలక్ష్మి, దేవి, గౌరవ సలహాదారు బృందావతి, కోశాధికారి కె.పద్మావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ శోభారాణి, జిల్లా నాయకులు నర్సమ్మ, కృపారాణి, సరస్వతి, శ్రీదేవి పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని నెహ్రూ చౌక్ జంక్షన్‌లో అంగన్‌వాడీలు భారీ ధర్నా చేపట్టారు. తొలుత సిఐటియు కార్యాలయం నుండి నాలుగు రోడ్ల వైజాగ్ బస్టాప్ వరకూ ర్యాలీ చేపట్టారు. ధర్నాలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీ మినీ సెంటర్లు అనేక సేవలను అందిస్తున్నాయన్నారు. మినీ అంగన్వాడీ కేంద్రాల్లో వర్కరు పని, హెల్పరు పని ఒక్కరే చేయాల్సి వస్తోందని, దీంతో పని భారం అధికంగా ఉంటోందని తెలిపారు. మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని జిఒ ఉన్నా సక్రమంగా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసరమైన సందర్భంలోగానీ, వేసవిలోగానీ మినీ వర్కర్లకు ఎటువంటి సెలవులూ ఇవ్వకపోవడం దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదని వాపోయారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో టిడిపి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జి.రామలక్ష్మి, కె.పార్వతి, వరలక్ష్మి, తనూజ, అంజలి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అదే స్థలం.. అదే వివాదం..!

శంకుస్థాపన చేస్తారన్న టిడిపి కూటమి ప్రచారంపై రైల్వే నుంచి స్పందన లేదు. తమకు స్థలమే ఇంతవరకూ బౌండరీ వేసి అప్పగించలేదంటూ రైల్వే అధికారులు పెదవి విరుస్తున్నారు. ఒక రైల్వే అధికారి 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ 'ఆ 52 ఎకరాల చుట్టూ బౌండరీ నిర్మాణం చేస్తేనే మాకు హేండోవర్ చేసినట్టు లెక్క' అని తెలిపారు. ఇదిలా ఉండగా ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఎన్‌టిపిసిలో ఈ నెల 29న దేశ ప్రధాని గ్రీన్ ప్రాజెక్టు విస్తరణ పనుల ప్రారంభానికి విచ్చేయనున్నారన్న సమాచారం నేపథ్యంలో సిఎం చంద్రబాబు రైల్వేజోన్ కార్యాలయ శంకుస్థాపనకు పిలిచే అవకాశం లేకపోలేదన్న చర్చ ప్రస్తుతం విశాఖలో సాగుతోంది.

18, 19న వ్యవసాయ రంగంపై సదస్సు

ఎయిర్ పోర్టు, రాడిసన్ బ్లూ హోటల్ వద్ద ప్రత్యేక హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. రాడిసన్ బ్లూ హోటల్ వద్ద ప్రధాన వేదికగా జరిగే ప్రాంతీయ సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి సమన్వయ లోపమూ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటన రోజున ప్రత్యేక వాహనాల ద్వారా నిపుణులను, అధికారులను మజ్జిపేట తీసుకెళ్లాలని, అక్కడ పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలని, మొబైల్ టాయిలెట్లను సమకూర్చాలని సూచించారు. సమావేశంలో ఎడిసిపి రాజ్ కమల్, భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాథుర్, వ్యవసాయ ఉన్నతాధికారులు, స్థానిక వ్యవసాయ శాఖ జెడి అప్పలస్వామి, డిడిలు, ఎడిలు, లైజన్ అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

కూటమి కపటం..!

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కూటమి ప్రభుత్వ కపటం తొలి బడ్జెట్‌లోనే కనబడింది. ఎన్నికల్లో తామర తంపరగా ఇచ్చిన హామీలు, చేసిన వాగ్ధానాలకు మోక్షం లభించదని దాని తీరు, దారి తెలిసినవారెవరికైనా ఇట్టే అర్థమవుతుంది. అర్థంకాకో, డూడూబసవన్నల్లా తలూపడానికి అలవాటుపడో, పదవుల భయమో తెలీదుగానీ జరిగిన అన్యాయంపై మౌనందాల్చడం ఈ ప్రాంత ప్రజాప్రతినిధులకు క్షంతవ్యంకాదు. తమ ప్రాంత ప్రజల ఆశలు, ఆకాంక్షలకు గౌరవం దక్కించుకోలేని పదవులెందుకు ? ఆత్మాభిమానం నిలబెట్టుకొని పనిచేసే శక్తియుక్తులు, చేవ లేనప్పుడు చట్టసభలకు వెళ్లాలన్న కోరికెందుకు ?. పదవీ వ్యామోహం, వ్యాపార ప్రయోజనం కలగలిసిన వారిని ఎన్నుకున్న దుష్ఫలితాలు స్టీల్‌ప్లాంట్ అమ్మకం రూపంలోనూ, కార్మికులు, ప్రజల నిరసన, ఆందోళనలను అణచివేసే స్వాట్ టీం రూపంలోనూ ముందుకు దూసుకొస్తున్నాయి. టిడిపి, వైసిపి, జనసేన, బిజెపి పార్టీ ఏదైనా, నాయకుడెవరైనా ప్రాంత పురోగతికి పట్టుబట్టి ఒత్తిడితెచ్చి సాధించినపని చెప్పుకోవడానికి ఒక్కటంటూ లేదు.

స్టీల్‌ప్లాంట్ అమ్మకపు ఆలోచన విరమించుకొని, సెయిల్‌లో విలీనం చేయాలని, లేదంటే సొంత గనులు కేటాయించాలని మోడీ ప్రభుత్వాన్ని ఎంపీలు పార్లమెంట్‌లో ఎందుకు అడగలేకపోతున్నారు. ప్లాంట్‌ను పరిరక్షించుకొనేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఎమ్మెల్యేలు ఒత్తిడి ఎందుకు తేలేకపోతున్నారు?. పై అంశంపై ప్రజలకు సమాధానం చెబితే జవాబుదారీతనంగా వుంటుంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 3.21 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి కలిగే బాబూజగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుపై తీవ్రమైన నిర్లక్ష్యం ప్రభుత్వం చూపింది. రూ.17 వేల కోట్ల విలువైన సుజల స్రవంతికి రూ.63.21 కోట్లును బడ్జెట్‌లో కేటాయిస్తే ఇదొక మహా ప్రసాదంలా ఎమ్మెల్యేలు భావించినట్లున్నారు. అందుకేనేమో సుజల స్రవంతికి కేటాయింపులు పెంచి పూర్తిచేయాలని అడిగే సాహసం చేయలేకపోయారు. కూటమి పొత్తులో టిక్కెట్‌రాని వారికి నామినేటెడ్ పదవులిచ్చి చల్లార్చే పనిలో ఇప్పుడు అధికార టిడిపి వుంది. ఎమ్మెల్యేలు తాము సూచించిన వారికి పదవులిస్తే చాలు, ఈ ప్రజలెలాపోతే మాకెందుకన్నట్లున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో అధిక ధరలు, భారాలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజల దగ్గరకు సిపిఎం వెళ్లింది. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపాలని, సర్దుబాటు ఛార్జీల పేర విద్యుత్ ఛార్జీలు పెంచొద్దని ఆ పార్టీ ప్రజాపోరు చేపట్టింది. ఈ నెల 8 నుంచి 14 వరకు ప్రచారంచేసి చివరి రోజున తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టింది. ఏ పార్టీ చూపని చొరవను ప్రజల పక్షానవున్న సిపిఎం ప్రదర్శించింది.

ఇన్నోవేషన్ ద్వారా విద్యకు సాధికారత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇన్నోవేషన్ ద్వారానే విద్యకు సాధికారత వస్తుందని మద్దిలపాలెం కృష్ణా కాలేజ్ రోడ్డులోని స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ మళ్ల వాణిశ్రీ పేర్కొన్నారు. విశాఖ నగరంలోని మద్రిపాలెం ఫెయిర్ ఫీల్డ్ మారియట్ హోటల్‌లో ఆర్డర్క్యాం మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన ఫ్యూచర్ ఫార్వర్డ్ ఎడ్యుకేషన్ వర్క్‌షాప్ అండ్ న్యూ నార్మల్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సమ్మిట్ అవార్డుల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎడ్ టెక్ తదితర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తే విద్యార్థుల లెర్నింగ్ సులువవుతుందన్నారు.

పూర్ణామార్కెట్ చిరు వ్యాపారులకు లబ్ధి

(మొదటి పేజీ తరువాయి..) తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మీడియాతో మాట్లాడుతూ పూర్ణా మార్కెట్‌లో రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారాలు చేసుకునే వారి వద్ద నుంచి, అలాగే మార్కెట్‌లో ఇతర వ్యాపారుల వద్ద నుంచి గతంలో ఉన్న కాంట్రాక్టర్ ఆశీలు పేరుతో అధికంగా వసూలు చేసేవాడని చెప్పారు. ఆ సమయంలో తమ సంఘం చిరు వ్యాపారుల పక్షాన ఉండి జివిఎంసి కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కొత్త కాంట్రాక్టర్ రావడంతో సమస్య పరిష్కారం అయిందన్నారు.

IN THE HON'BLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.813/2024

Between:
Pedda Vijaya Raghavendra Rao ...Plaintiff
And:
Sri Tutika Sateesh Kumar & another ...Defendants

SUMMONS

To,
D-1: Sri Tutika Sateesh Kumar, S/o. T. Eswara Rao, Hindu, aged 37 years, R/at D.No.36-91-27, Ravindra Nagar, Kancharapalem, Visakhapatnam-09
D-2: Sri Patchipulusu Swapana Kumari, D/o. Subbalakshmi, Hindu, aged 28 years, R/at D.No.2-15-42/1/1/218, Talupula Oceanic Apartments, Fishermen Colony, Near Lumbini Park, Sector-II, MVP Colony, Visakhapatnam

Please take notice that the above named plaintiff has instituted the above suit against you and the matter stands posted to **04-12-2024** for your appearanceon that day at **10:30 A.M**. you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte, as per law

(By Order of the Hon'ble Court)
Y. VASANTHA KUMARI,
Advocate
Visakhapatnam.
Cell: 9618960346.

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.A.66/2023 in E.P.126/2016 in O.S.1503/2015

Between:
Smt. Deva Padmavathi ...Petitioner/3rd Party
And:
Smt. Agraharapu Anasuya & 2 others ...Respondents

NOTICE

To,
R-2: Sri Kanakala Suribabu, S/o.Appala Naidu, Hindu, aged 65 years R/at New Santhosh Nagar, Kotagaruvu, Chinagadhili Mandal, Visakhapatnam.
R-3:Smt. Santhoshi Kumari, W/o. Satyanarayana, Hindu, aged 25 years, Rest -do-

Please take notice that the above named 3rd party/claim petitioner filed claim petition against you under Order XXI Rule 58 of C.P.C asserting her right over the schedule property and seeking declaration that she is the absolute owner of the schedule property and to raise the attachment order passed against the schedule property in the above proceedings i.e. in E.P.126//2016. The matter stands posted to **05-12-2024** for your notice. So you are hereby informed to appear before the Hon'ble VI Addl. Senior Civil Judge Court, at Visakhapatnam on **05-12-2024** at **10:30 A.M** either in person or through an Advocate, failing which the matter will be decided in your absence.

BEVARA SATYANARAYANA,
Advocate, Visakhapatnam.
Cell: 9440527406

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
IP. No: 2/2024

Between:-
బెల్లాన కొత్తంనాయుడు .....పిటిషనర్
And:
మజ్జి లత ఇతరులు .....రెస్పాండెంట్లు

To:
మజ్జి లత, W/o లేటు సురేష్ కుమార్, ఉరాఫ్ ఈశ్వరరావు, ఎం.వి.పి కాలనీ, విశాఖపట్నం.

యిందిలి పిటిషనర్ మీ పైన మరియు మరికొంతమందిపై పిటిషనర్ దివాలా దారుగా డిక్లయిర్ చేయవలసినదిగా దాఖలు చేసి యున్నారు. సదరు పిటీషన్‌లో కోర్టువారు మీకు నోటీసులు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకొనటలేదు. కావున పై నెంబరు **IP. No:2/2024 తే 3-12-2024 దీకి మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది.** కావున అ దినం ఉదయం 10:30 గంటలకు స్వయంగా గాని వకీల్ ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకోవలసినదిగా ఆజ్ఞాపించడమైనది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించడం జరుగునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
ఎ. నగేష్ కుమార్
న్యాయవాది,
బొబ్బిలి, సెల్: 9849879051

ప్రకటన

ది. 15-11-2024 నాడు శ్రీమతి సాగి అమృతవల్లి W/o. సాగి కుమార్ (లేటు) మరియు సాగి సర్వజ్ఞ D/o. సాగి కుమార్ (లేటు) ఎదుర్లంక నుండి విశాఖపట్నం ప్రయాణించుచుండగా, వారికి చెందిన డాక్యుమెంట్లుతో కూడిన బ్యాగ్గు ఒకటి పడిపోయినది. అందులో సాగి కుమార్ గారికి చెందిన (SRO, ఆనందపురంలో రిజిస్టరు కాబడిన) దస్తావేజు నెం. 1216/2015 మరియు దానికి లింకు డాక్యుమెంటు ముదునూరి జయచంద్ర రాజు కి చెందిన (SRO, భీమిలిలో రిజిస్టరు కాబడిన) దస్తావేజు నెం. 1747/2005 మరియు సాగి కుమార్ పేరున ఉన్న (SRO, ద్వారక నగర్‌లో రిజిస్టరు కాబడిన) దస్తావేజు నెం. 2731/2006 పైన ఉదహరించిన మూడు దస్తావేజులు పోయినవి. ఎవరికైనా ఈ దస్తావేజులు దొరికినచో వాటిని వెంటనే 8074256283 కు ఫోన్ చేసి సమాచారం అందజేయగలరు. సదరు దస్తావేజులపై ఇతర వ్యక్తులు ఎవరైనా ఎట్టి లావాదేవీలు జరిపినను మేము బాధ్యులం కాము. పూర్తి హక్కులు సాగి కుమార్ కు వారసులమైన సాగి అమృతవల్లి మరియు సాగి సర్వజ్ఞ లకు మాత్రమే ఉన్నవని తెలియజేయడమైనది.

సాగి అమృత వల్లి మరియు సాగి సర్వజ్ఞ
డోర్ నెం. 2-58A, మెయిన్ రోడ్,
ఎదుర్లంక, ఐ.పోలవరం మండలం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా - 533464
ఫోన్: 8074256283

C.P.C. Order 9 Rules 9 ప్రకారం నోటీసు
మహారాజశ్రీ చోడవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్యసముఖమునకు
I.A. 552/2019 O.S. 83/2017

Between:
State Bank of India Kothakota Branch . . . పిటిషనరు
అండ్:
తనుకు సత్యవేణి . . . రెస్పాండెంటు
టు: తనుకు సత్యవేణి,
భర్త నారాయణమూర్తిరాజు
డో.నెం. 5-4, గట్టావీధి, కొత్తకోట గ్రామం,
రావికమతం మండలం.

అను వారికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు దావాలో శ్రీకోర్టు వారు జారీ చేసిన తే:27-06-2019 గల Default order ను రద్దు పరుపించి పై నెంబరు దావాను Restore చేయింపించి కోరి పై నెంబరు పిటిషనరు, పిటిషను దాఖలు చేసియున్నందున, అందు విషయమై మీకు ఎట్టి ఆక్షేపణలున్ననూ **తే: 21-11-2024దీని** మహారాజశ్రీ చోడవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి ఎదుట **ఉదయం 10-30 ని॥కు** హాజరుఅయి, మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు విమర్శించి, తీర్మానించడమగునని యిందుమూలంగా తెలియపర్చడమైనది.

B.V.B.JAGANNADHA RAO
పిటిషనరు తరపు అడ్వకేట్,
చోడవరం
అనకాపల్లి జిల్లా.
చోడవరం
తే:16-11-24

గ్రామ పంచాయతీ కార్యాలయము - ఈ.బోనంగి
పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా.

తేదీ.13-11-2024

అనకాపల్లి జిల్లా, పరవాడ మండలం, ఈ.బోనంగి గ్రామపంచాయితీలో పరిధిలో దొంగతనాలు, దోపిడీలు జరగకుండా ఒక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసుకొనుటకు ఈ గ్రామపంచాయితీలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయుటకు తీర్మానించడం అయినది. ప్రస్తుతం పరవాడ మండలంలో ఈ బోనంగి గ్రామ పంచాయితీ పరిధిలో పారిశ్రామిక వాడ దిన దినాభివృద్ధి చెందుచున్న సందర్భంగా గ్రామాల్లో వలస కార్మికులు ఎక్కువ అగుచున్నారు. దీని దృశ్య ఈ గ్రామ పంచాయితీ వారు సిసి నిఘా కెమెరాలు ఏర్పాటు చేయుటకు నిర్ణయించియున్నారు. కావున సిసి కెమెరాలు ఏర్పాటు చేయుటకు గాను సీల్డ్ టెండర్లు (కొటేషన్లు) కోరబడుచున్నవి. టెండరు తేదీ: 23-11-2024 మధ్యాహ్నం 3 గంటల వరకు తీసుకొని అదేరోజు హాజరైన టెండరు దారు సమక్షంలో పంచాయితీ కార్యాలయంలో టెండర్లు తెరవబడును. మిగిలిన విషయాలు పంచాయితీ కార్యాలయం పని చేయు వేళల్లో తెలుసుకొనవచ్చును. టెండరులో పాల్గొనే వారు 1000/- రూపాయలు ధరావత్తు చెల్లించవలెను. టెండర్లును వాయిదా వేయుటకు గాని రద్దు చేయుటకు గాని ఈక్రింది సంతకదారుని యొక్క అధికారికి కలదు.

సం/- జి.వి.నాగభూషణరావు పంచాయితీ కార్యదర్శి
ఈ.బోనంగి గ్రామపంచాయితీ, పరవాడ మండలం

గ్రామ పంచాయతీ కార్యాలయము - ఈ.బోనంగి
పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా.

అనకాపల్లి జిల్లా, పరవాడ మండలం, ఈ.బోనంగి గ్రామపంచాయితీలో పరిధిలో తడి మరియు పొడి చెత్త సేకరణ చేయుటకు గాను తరచూ రిక్షాలు రిపేర్లకు వచ్చుచున్నందున పారిశుధ్యం పనులు మందగించడం జరుగుచున్న సందర్భమున ఈ గ్రామ పంచాయితీ నందు ఇంటి నుండి తడి పొడి చెత్తను సేకరించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రంనకు తరలించుటకు పంచాయితీనకు ఆదాయం వచ్చు విధముగా సేంద్రీయ ఎరువులు తయారు చేసి అమ్మకం ద్వారా పంచాయితీలకు అదనపు ఆదాయం వచ్చు విధముగా తీర్చిదిద్దుటకు ఒక మోటార్ వెహికల్‌ను గ్రామపంచాయితీ సాధారణ నిధుల నుండి కొటేషన్ పద్ధతులో కొనుగోలు చేయుటకు గతంలో టెండర్లు తే: 22-02-2023దీ మధ్యాహ్నం 3.00 గంటల వరకు అని తే: 10-02-2023దీ నాడు పత్రికా ప్రకటన ఇవ్వడమైనది. కావున ఎవ్వరు హాజరుకానందున మరల తే:23-11-2024దీ మధ్యాహ్నం 3.00 గంటల వరకు తీసుకొని అదేరోజు హాజరైన కొటేషన్లుదారు సమక్షంలో పంచాయితీ కార్యాలయంలో కొటీషన్లు తెరవబడును. కొటేషన్లులో పాల్గొనేవారు 1000/- రూపాయలు దరావత్తు చెల్లించవలెను. మిగిలిన విషయాలు పంచాయితీ కార్యాలయం పనిచేయు వేళల్లో తెలుసుకొనవచ్చును. కొటేషన్లను వాయిదా వేయటం గాని రద్దు చేయుటకు గాని ఈక్రింది సంతకం ద్వారా యొక్క అధికారికి కలదు.

సం/- జి.వి.నాగభూషణరావు పంచాయితీ కార్యదర్శి
ఈ.బోనంగి గ్రామపంచాయితీ, పరవాడ మండలం
తేదీ.13-11-2024

పర్యాటక అందాల కనువిందు!

● కార్తీకం పిక్నిక్‌లకు భీమిలి స్పాట్స్ స్వాగతం

ప్రజాశక్తి -భీమునిపట్నం : కార్తీక వనభోజనాలు, పిక్నిక్‌లు, విహారయాత్రలకు వచ్చే ప్రజలకు భీమిలి అందాలు స్వాగతం పలుకుతున్నాయి. ఇక్కడి సాగరతీరం ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. స్థానికంగా ఉన్న లైట్‌హౌస్, గంట స్తంభం, పావురాల పార్కు, మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు, గోకుల్, చిల్డ్రన్స్ వంటి సాగర తీరంలోని పార్కులను సందర్శించిన వారికి మధురానుభూతిని మిగల్చనున్నాయి.

పావురాల పార్కు సందర్శన ఓ అనుభూతి

సాగరతీరాన పార్కుల్లో డాల్ఫిన్, మత్యకారుల బొమ్మలు, సాగరకన్య, బుద్ధుని విగ్రహం ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. ఇక కుందేళ్ళు, పావురాలు, తాబేళ్లతో ఉన్న పావురాల పార్కును సందర్శించిన అనుభూతి మర్చిపోలేనిది. తాబేళ్ల బుడిబుడి నడకలు, కుందేళ్ళ గెంతులు, పావురాల సందడి పిల్లల్లో ఎంతో సంతోషాన్ని నింపుతాయి.పిల్లలు జొన్న పొత్తుల గింజలను పావురాలు, కుందేళ్ళకు వేసి అవి తింటుంటే చూసి పడే సంబరం అంతా ఇంతాకాదు.

చూడముచ్చటైన నీలిసంద్రం సోయగం

భీమిలిలో ఎటు చూసినా నీలి సంద్రం సోయగాలు, పచ్చని చెట్లు, పూల పరిమళాలు, ఎత్తైన ఇసుక తిన్నెల వయ్యారాలు సందర్శకులను మైమరపింపజేస్తాయంటే అతిశయోక్తి కాదు. మరోవైపు ఆధ్యాత్మికతను పంచే ఆలయాలు, చరిత్రకు సజీవసాక్ష్యంగా నిలిచే బౌద్ధారామాలు, గంటస్తంభం, పురాతన కట్టడాలు అలనాటి చారిత్రక ఆనవాళ్లను గుర్తు చేస్తాయి. ఇలా ఎన్నో అందాలు భీమిలి ,విశాఖ తీరంలో కనువిందు చేస్తుండడంతో వైజాగ్ వచ్చిన ప్రతి వారూ భీమిలి అందాలను కూడా చూడాలని అనుకుంటారు. ఎర్ర మట్టి దిబ్బలు, తొట్లకొండ, రామానాయుడు స్టూడియో చూడదగిన ప్రదేశాలు.

కార్తీకంలో సందర్శకుల తాకిడి

భీమిలి అందాలు చూసేందుకు అటు శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం, రణస్థలం, లావేరు, విజయనగరం జిల్లా భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ, ఇటు ఉమ్మడి విశాఖ జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తుంటారు. కార్తీకంలో ఇక్కడ వనభోజనాలను చేయడం, ఇక్కడ నెలవైన అందాలను ఆస్వాదించడం ఒక తీపి జ్ఞాపకంగా పదిలపరచుకుంటారు.

భీమిలి తీరంలో పార్కులో కొలువుదీరిన బుద్ధుడు

పార్కులో మత్స్యకారుడు

డాల్ఫిన్స్ అందాలు

భీమిలి గంటస్తంభం

84 మందికి విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ కొర్రపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 84మందికి శనివారం విద్యాసామగ్రిని అందజేశారు. ఎస్ఒఎస్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.రాజ్‌కుమార్ పాల్గొని, విద్యార్థులకు పుస్తకాలు, బాక్స్, స్టేషనరీతో కూడిన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులంతా క్రమశిక్షణతో చదువుకుని, భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని సూచించారు.

ఎస్ఒఎస్ సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. ఎస్ఒఎస్ ప్రోగ్రాం మేనేజర్ కరోతు దుర్గారాజు మాట్లాడుతూ, మహిళలకు ఆర్థిక స్వావలంభన, విద్యార్థులకు ట్యూషన్స్, పోషకాహారం పంపిణీ, కెరీర్ గైడెన్స్, బాలల హక్కుల అవగాహన వంటి కార్యక్రమాలను చేస్తున్నట్లు వివరించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రావణి, యానిమేటర్ చందక జానకి,విద్యార్థులు, వారి తల్లులు హాజరయ్యారు.

జోరుగా రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి - భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని ఒకటి నుంచి నాలుగు వార్డులో బిటి రోడ్డు మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. జివిఎంసి సాధారణ నిధులు రూ.3.44లక్షలతో 1,2 వార్డుల్లోనూ, రూ 8.04 లక్షలతో 3,4 వార్డుల్లోనూ రోడ్ల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. మూడో వార్డు లో జరుగుతున్న మరమ్మతు పనులను శనివారం జివిఎంసి ఇఇ కె దిలీప్‌కుమార్, డిఇఇ జి.శ్రీరామమూర్తి, ఎఇ జి.సురేష్ పరిశీలించారు.

రెండు వ్యాన్లు దగ్ధం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని ఆర్.శివరాంపురంలో నమ్మి తాతాజీకి చెందిన రెండు వ్యాన్లు శుక్రవారం రాత్రి దగ్ధమయ్యాయి. గ్రామంలో రెండు వేర్వేరు చోట్ల తాతాజీకి చెందిన వ్యాన్లుపార్కు చేశారు. తాతాజీ విజయవాడ కనక దుర్గమ్మ దర్శనానికి వెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక రెండు వ్యాన్లు ఒకేసారి దగ్ధం అవుతుండడాన్ని గమనించిన స్థానికులు, మంటలను అదుపు చేశారు. వేర్వేరు చోట్ల పార్కింగ్ చేసిన రెండు వ్యాన్లు ఒకేసారి దగ్ధం అవడంపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే తాతాజీ తన ప్రయాణాన్ని రద్దు చేసుకుని తిరిగి గ్రామానికి చేరుకున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసరావు శనివారం సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి దర్యాప్తు ప్రారంభించారు. వ్యాన్లు యజమాని తాతాజీని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు పరామర్శించారు. తాతాజీకి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

పునరుద్ధరణ పథకాలకు బడ్జెట్‌లో నిధులు పెంచాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : గత వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన ఎస్‌సి సంక్షేమ పథకాలను పునరుద్ధరించిన కూటమి ప్రభుత్వం, బడ్జెట్‌లో వాటికి సరిపడా నిధులు కేటాయించలేదని విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు అన్నారు. శనివారం అంబేద్కర్ భవన్‌లో పలు దళిత సంఘాల నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ, ఎస్‌సిలకు ఉచితవిద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, పెళ్లికానుక, భూమికొనుగోలు, హాస్టల్ భవనాల పునర్నిర్మాణం, మరమ్మతులు, ఎస్‌సి సబ్‌ప్లాన్ వాటా, ధరల నియంత్రణ ఇలాపలు పథకాలకు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఎటూ సరిపోవని, వాటిని పెంచాలన్నారు. సబ్‌ప్లాన్ నోడల్ కమిటీల్లో దళితులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. బడ్జెట్‌కు పది సవరణలను ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. విపక్షహోదా ఇవ్వలేదన్న సాకుతో అసెంబ్లీకి డుమ్మా కొట్టిన 11మంది వైసిపి ఎమ్మెల్యేలు తమ పదవులకు అనర్హులని, వారు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సోడదాసి సుధాకర్ . అధ్యక్షతన జరిగిన సమావేశంలో కెవిపిఎస్ నేతలు ప్రకాష్, ఇమ్మాన్యుయేల్, ఇతర దళిత సంఘాల నేతలు ఎన్.రాజు, పట్టా రమేష్, వేణుగోపాల్, గొలమాల అప్పారావు, కె.చిన్నారావు, రాజేంద్రప్రసాద్, ఎం.కోటి, మంగవేణి, విదసం నాయకులు జాజి ఓంకార్, నిర్మల, కస్తూరి వెంకటరావు, గుడివాడ ప్రసాద్, కుమార్, భాస్కర్, రాజు, ఈశ్వర్, మహేష్ పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఐదోవార్డు స్వయంకృషి నగర్, వికలాంగుల కాలనీ, కార్పెంటర్స్ కాలనీ తదితర కొండవాలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి పైపులైన్లతో కుళాయిలను ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక వార్డు కార్పొరేటర్ మొల్లిహేమలత అన్నారు శనివారం రూ. 60లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కొండవాలు ప్రాంతాల నీటి పైపులైన్ల పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి వార్డు అధ్యక్షులు నాగోతి వెంకట సత్యనారాయణ, బిసి సెల్ అధ్యక్షులు నమ్మి శ్రీను, జనసేన అధ్యక్షులు దేవర శివ, కొండప రాజు, బోని నరసింహమూర్తి, సూర్య,శివ, ఆనంద్, సాయిబాబు, బి.ఈశ్వరరావు, శ్రీను,ఈశ్వరరావు పాల్గొన్నారు.

పైపులైన్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న హేమలత

బోర్లు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి

మంచినీటి బోర్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : 10వ వార్డు పరిధి రవీంద్రనగర్, బిఎన్ఆర్ నగర్ ప్రాంతాల్లో మంచినీటి బోర్లను శనివారం వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, దొంతల రమణ, జనసేన నాయకులు బండి రాజా రమేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ మద్దిల రాజేష్, త్రినాద్, చోడిగింజ అప్పలనాయుడు జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

జూను సందర్శించిన 'షారోన్' విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ : మానసిక అంగవైకల్యం కలిగిన పిల్లలకు జివిఎంసి ఆరోవార్డు పిఎం పాలెం రెండో బస్‌స్టాప్ దగ్గరున్న షారోన్ స్పెషల్ స్కూల్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని డైరెక్టర్ శైలో శాస్త్రి తెలిపారు. శనివారం పాఠశాలకు చెందిన 20 మంది పిల్లలు విజ్ఞానయాత్రలో భాగంగా ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు (జూ పార్కు)ను సందర్శించారు. వీరికి గీతం యూనివర్సిటీలో ఎంఎ ఫస్టియర్ సైకాలజీ విద్యార్థులు సహాయ సహకారాలు అందించారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ శైలో శాస్త్రి మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి 16ఏళ్లలోపు మానసిక అంగవైకల్యం కలిగిన పిల్లలకు తమ పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నామన్నారు. జూసందర్శనలో తమకు సహకరించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్ బి గోపి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భారతి, శ్రీహరి, డి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి -ఉక్కునగరం : అగనంపూడి సమీపంలోని డొంకాడ గ్రామం వద్ద జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుగ్గ పవన్‌సాయి అనే ఏడేళ్ల బాలుడు మృతి చెందాడు. రోడ్డు దాటుతున్న సమయంలో విఆర్ఎస్ లాజిస్టిక్ చెందిన బస్సు ఢీకొంది. బాలుడి తలపై నుంచి ఫార్మసిటీ బస్సు చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రుల కళ్ళ ముందే ఈ ఘటన జరగటం పలువురిని కంటతడి పెట్టించింది. శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ఘటన చోటుచేసుకుంది. స్థానికులు బస్సు డ్రైవరును దేహశుద్ధి చేసి, అనంతరం అగనంపూడి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాలుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలుడు తండ్రి బిసి కాలనీలో నివాసముంటూ, ఫార్మాసిటీలో ఉద్యోగం చేస్తున్నారు. ఒక్కగానొక్క కొడుకు దుర్మరణంతో బాలుని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ములగాడ : ఫ్యాన్‌కు ఉరేసుకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శ్రీహరిపురం జోహార్ నగర్‌లో చోటుచేసుకుంది మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివి. శ్రీహరిపురం జోహార్ నగర్, విటి కాలేజీ రోడ్డులో నివాసముంటున్న నేవీ మాజీ ఉద్యోగి సందీప్(35) ఇంట్లో ఫ్యానుకు.ఉరివేసుకొని మృతి ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు, మతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. మల్కాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృత్యువాత

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వేములవలస గ్రామానికి చెందిన సారికి ఆపాలనాయుడు(43) పురుగుల మందు తాగి శనివారం మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం వేములవలస గ్రామానికి చెందిన సారికి అప్పలనాయుడు, భార్య రమణమ్మ ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె డెలివరీకి విజయనగరం ఆస్పత్రికి తీసుకువెళ్లి, ఈనెల 15న హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ విషయంలో భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో అదేరోజు ఇంటికి వచ్చి గడ్డి వాము దగ్గర పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పలనాయుడును చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆరోగ్యవిషమించడంతో శనివారం మృతి చెందాడు. మృతుడు భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ చింతా వాసునాయుడు ఆధ్వర్యంలో ఎఎస్ఐ పైడిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు

బావిలో పడి మహిళ మృతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కాశీపురం గ్రామంలో బావిలో పడి ఓ మహిళ మృతి చెందింది. కాశీపురం గ్రామానికి చెందిన చిటిమిరెడ్డి లక్ష్మి (62) అనే మహిళలకు మతిస్థిమితం సరిగ్గా లేక బావిలో పడి మృతి చెందిందని స్థానికులు భావిస్తున్నారు. సచివాలయ మహిళా పోలీసు స్థానిక పీఎస్‌కు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కు తరలించారు.

58 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి- గాజువాక : పాత గాజువాక శ్రీ కన్య థియేటర్ దగ్గర జి శేఖర్ అనే వ్యక్తి, అక్రమంగా డిఫెన్స్ బాటిల్ అమ్ముతుండగా, దాడి చేసి పట్టుకున్నామని ఎక్సైజ్ సిఐ నాగశ్రీనివాసరావు తెలిపారు. నిందితుడి నుంచి 750 మిల్లీమీటర్ల పరిమాణం గల 58 డిఫెన్స్ మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

16 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ : పాత కేడిపేట బంగారంపేట రహదారి శివారులో 16 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని యువకుడిపై కేసు నమోదు చేసినట్లు కృష్ణదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. శనివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన కాగిత జశ్వంత్ స్కూటీ తనిఖీ చేయగా గోనెసంచిలో గంజాయి గుర్తించారు.గంజాయితోపాటు నిందితుడి సెల్‌ఫోన్, స్కూటీని స్వాధీనం చేసుకుని, కేను సమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

28 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: పోలీసు సిబ్బంది తనిఖీలలో చోడవరానికి చెందిన ఎస్.సత్యనారాయణ 28 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా బుచ్చయ్యపేట గ్రామంలో పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో దళితులపై దాడి హేయం

మాట్లాడుతున్న కెవిపిఎస్ నేత చిరంజీవి

ప్రజాశక్తి -గాజువాక : మధ్యప్రదేశ్‌లోని విజయపూర్‌లో జరిగిన ఉప ఎన్నికలలో తమకు ఓటు వేయలేదనే అక్కసుతో దళితులపై బిజెపి గూండాలు దాడిని, అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బన్న అన్నారు. శనివారం గాజువాకలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, బుధవారం పోలింగ్ జరిగిన రాత్రి విజయపూర్ నియోజక వర్గంలో దళితులు ఎక్కువగా నివసించే గోహ్రా గ్రామంపై 200 మంది బిజెపి గూండాలు దాడికి తెగబడి, కనిపించిన వారిని రాళ్ళతో కొడుతూ, ఆయుధాలతో దాడి చేశారన్నారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారన్నారు.కెవిపిఎస్‌జిల్లా ప్రధాన కార్యదర్శి టి చిరంజీవి మాట్లాడుతూ ఎన్నికల ముందు కూడా ఓట్లు వేయాలంటూ దళితులను తుపాకులతో బెదిరించినా, మధ్యప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం దళితులకు కనీసం రక్షణ కల్పించక పోవడం అన్యాయమన్నారు. దాడి తర్వాత కూడా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-సీతమ్మధార :వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిఎంహెచ్ఒ డాక్టర్ పి జగదీశ్వరరావుకు వినతిపత్రం అందజేసినట్లు తెలుగునాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 14న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు విడుదల చేసిన ఉత్తర్వులు అమలు అయ్యేలా చూడాలని కోరామన్నారు.ఎఎన్ఎం ల రీడిప్లమెంట్ రద్దు, ఎంపిహెచ్ఎస్ ప్రమోషన్ కోసం రెగ్యులర్ అయిన హెల్త్ అసిస్టెంట్ల సీనియార్టీ జాబితా తయారు చేయాలని కోరినట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతానికి వేసిన హెల్త్ అసిస్టెంట్ల రీబ్యాక్, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరగా, డిఎంహెచ్ఒ సానుకూలంగా స్పందించారన్నారు.కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, విశాఖ జిల్లా అధ్యక్షులు నగేష్ పట్నాయక్, ప్రధాన కార్యదర్శి రాముమనాయుడు, ఉపాధ్యక్షులు రమణ, మురళీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ భీమిలి సమన్వయకర్తగా వీర్రాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : కాంగ్రెస్ పార్టీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా నండూరి వీర్రాజు నియమితు లయ్యారు ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి నుంచి నియామకపత్రం స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనను భీమిలి సమన్వయకర్తగా నియమించిన ఎపిసిసి అధ్యక్షులు షర్మిలారెడ్డికి, డిసిసి అధ్యక్షులు అడ్డాల వెంకటవర్మ రాజుకు ధన్యవాదాలు తెలిపారు.

పలు గ్రామాల్లో రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని పలు పంచాయతీల్లో పల్లె పండగ కార్యక్రమంలో ఉపాధి నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి శనివారం పరిశీలించారు. రామవరంలో రూ.60లక్షలు, దబ్బందలో రూ.80 లక్షలు, తర్లువాడలో రూ.52 లక్షలతో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఏర్పాటు చేసిన సిసి రోడ్లను పరిశీలించారు. రోడ్డు నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మండల ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ డాక్టర్ జానకి

పోరాటాలతో పోర్టు ఆసుపత్రిని పరిరక్షించుకుంటాం

47వ రోజుకు రిలే నిరసనలు

దీక్షల్లో పాల్గొన్న పోర్టు ఉద్యోగులు, సిఐటియు నేతలు

ప్రజాశక్తి -సీతమ్మధార : విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని ప్రైవేటుపరం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచనను వెంటనే వెనక్కు తీసుకుని, పోర్టు సొంత నిధులతో అభివృద్ధి చేయాలని సిఐటియు నాయకులు కె.నారాయణ డిమాండ్ చేశారు. శనివారం పోర్టు ఆసుపత్రిని పిపిపి విధానంలో ప్రయివేటీకరణకు నిరసనగా 47వ రోజు రిలే నిరసన దీక్షల్లో మాట్లాడుతూ, పోర్టు లాభాలతో ఈ ఆసుపత్రిని అభివృద్ధి చేశారని, మరో వందేళ్లకు సరిపడా రిజర్వు నిధులు పోర్టు ఆసుపత్రికి ఉన్న నేపథ్యంలో అభివృద్ధి పేరిట దీన్ని ప్రయివేటుకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, డిసిఐ పరిరక్షణ ఉద్యమం స్ఫూర్తితోనే పోర్టు ఆసుపత్రిని ప్రయివేటుకు దక్కకుండా కాపాడు కుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో.సిఐటియు నాయకులు, జె.సత్య నారాయణ, బి.లక్ష్మణరావు, కె.ఎస్.కుమార్, జగన్ శంకర రావు, నాయుడు, శ్రీను, గణేష్ ,రాఘవులు పాల్గొన్నారు.

మూడో రోజుకు మత్స్యకారుల రిలే దీక్షలు

దీక్షా శిబిరంలో నూకరాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం :తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద మత్స్యకారుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రిలేదీక్షలు శనివారం మూడోరోజు కొనసాగాయి. దీక్షా శిబిరంలో ఎగువ పేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ, శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించి బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహిస్తున్న యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని పరిశ్రమలు వెదజల్లుతున్న నీటి, వాయు కాలుష్యంతో సమీప గ్రామాల ప్రజలు, మత్స్యసంపదపై తీవ్ర ప్రభావం చూపుతోం దన్నారు. వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలకు బడాబాబులు, కొన్ని సంస్థలు తీరాన్ని ఆక్రమిస్తుంటే అధికారులు చోద్యం చూడడం శోచనీయమని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సిహెచ్ రమేష్, గ్రామాభివృద్ధి సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నరసింగరావు, కోశాధికారి బి.కొండబాబు, గ్రామ పెద్దలు వి.గరగయ్య, వాసుపల్లి నరసింగరావు పాల్గొన్నారు

పలుచోట్ల జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

తగరపువలస, ఆరిలోవలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు గాంధీబొమ్మ నగరపువీధిలో టిడిపి వార్డు అధ్యక్షులు తమ్మిన సూరిబాబు ఆధ్వర్యంలో శనివారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గరే చంద్రమౌళి, కొప్పల కృష్ణ, బి నారాయణరావు, ఆదిరాజు పాల్గొన్నారు

ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు కనకదుర్గ నగర్‌లో శనివారం ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. రూ 100 లతో టిడిపి సభ్యత్వం తీసుకుంటే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు గాడి సత్యం, విశాఖ పార్లమెంట్ కమిటీ కార్యదర్శి ఎడువాక సన్యాసిరావు, గోపల్లి రామకృష్ణ, నక్కాన లత, వాసు, మొల్లి అనిల్, గోపిసాయి, కాంతారావు పాల్గొన్నారు.

నీతి, నిజాయితీతోనే న్యాయవాద వృత్తిలో రాణింపు

ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి

సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ రవి

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : న్యాయశాస్త్రం నిర్దేశించిన నైతికత, నీతి, నిజాయితీ, విలువలే పెట్టుబడిగా న్యాయవాద వృత్తిలో జూనియర్లు రాణించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి అన్నారు. శనివారం న్యాయవాదుల గ్రంథాలయంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ నిర్వహించిన డాక్టర్ పద్మనాభరెడ్డి స్మారకోపన్యాసంలో మాట్లాడుతూ, నేటి తరం న్యాయవాదులకు పద్మనాభరెడ్డి వృత్తిపట్ల నిబద్ధత ఆదర్శనీయమన్నారు. ఉమ్మడి రాష్ట్ర హైకోర్టులో రోజుకు 50 పైచిలుకు కేసులు ఉన్నప్పటికీ, ప్రతి కేసులోనూ స్వయంగా తానే హాజరై కక్షిదారులకు న్యాయమంది చేందుకు పద్మనాభరెడ్డి సర్వశక్తులు ఒడ్డి, కృషి చేసేవారన్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని జస్టిస్ రవి గుర్తు చేసుకున్నారు. నేటి కొత్త తరం న్యాయ వాదులకు సబ్జెక్టు పరంగా పూర్తి పరిపక్వతతో వాదనలు వినిపిస్తున్నప్పటికీ, నైతిక విలువల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వెలిబుచ్చారు. కోర్టు హాలులో క్రమశిక్షణ, సీనియర్స్‌కు గౌరవం ఇచ్చిపుచ్చుకోవడం నేటితరం న్యాయవాదులు నేర్చుకోవాలన్నారు. సమాజాభివృద్ధిలో న్యాయవాదుల పాత్రను వివరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన అఖిలభారత న్యాయవాదుల సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెఎస్ సురేష్ కుమార్ మాట్లాడతూ, ఎన్నో కేసులతో ఒత్తిడిలో ఉన్నప్పటికీ, పద్మనాభరెడ్డి జూనియర్ లాయర్ల పట్ల వాత్సల్య భావనతో ఉండి, మెళకువలను నేర్పేవారన్నారు. నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ, నీతికి నిజాయితీకి వృత్తిలో నైతికతకు పద్మనాభరెడ్డి నిదర్శనమన్నారు. ఎపి హైకోర్టు బార్ కౌన్సిల్ పూర్వ ఉపాధ్యక్షులు రామ జోగేశ్వరరావు మాట్లాడుతూ జస్టిస్ వికార్ కృష్ణయ్య భావాలను పుణికిపుచ్చుకొని పద్మనాభ రెడ్డి న్యాయవాదవృత్తిని కొనసాగించారన్నారు. ఐఎఎల్ జనరల్ సెక్రెటరీ అజయ్ కుమార్ జహరా, కార్యక్రమ ఆర్గనైజర్ భగవతి, యూనియన్ ఉపాధ్యక్షులు బగాది తులసీదాస్, పి నర్సింగరావు, డి రమేష్, చింతపల్లి రాంబాబు పాల్గొన్నారు.

నేడు నృత్యోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ :భారతీయ సాంప్రదాయ కళారూపాల పరిరక్షణే లక్ష్యంగా పరంపర ఫౌండేషన్, స్టెప్ డాన్స్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యాన 'ఇండియా : కో ఎగ్జిస్టింగ్ విత్ ట్రెడిషన్ అండ్ మోడర్నిటీ' పేరిట ఈనెల 17న ఆదివారం బీచ్‌రోడ్డులోని ఎంజిఎంపార్కు మెయిన్ లాన్స్‌లో ప్రత్యేక నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పరంపర ఫౌండేషన్ వ్యవస్థాపకులు, డాక్టర్ నాగి బి. రావు, శశి రెడ్డి తెలిపారు. సాంప్రదాయ కళలతో పాటు ఆధునిక నృత్య శైలిలను విశాఖ నగరవాసుల ముందుకు తెచ్చేవారికి అద్భుత అనుభూతి కలిగించడమే ఈ ప్రదర్శన లక్ష్యమన్నారు. ఈ ప్రదర్శనకు ఎంపీ ఎం.శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జివిఎంసి కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్, గీతం వర్సిటీ విద్యావేత్తలు పాల్గొంటారన్నారు.

నేడు ఎర్రవానిపాలెంలో కోలాటం పోటీలు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని కణమాం పంచాయతీ ఎర్రవానిపాలెంలో దుర్గాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం కోలాటం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గోరింట, ఎర్రవానిపాలెం, సియ్యాద్రి మెరక, అరిగి మెరకలో గ్రామ పెద్దలు సహకారంతో ఆలయం వద్ద పోటీలు నిర్వహించి, విజేతలకు మొదటి బహుమతిగా రూ.పది వేలు, ద్వితీయ బహుమతిగా రూ.8వేలు, తృతీయ, చతుర్థ, పంచమ బహుమతులుగా వరుసగారూ.ఆరువేలు, రూ.ఐదువేలు, రూ.నాలుగు వేలు ఇస్తామన్నారు. వేడుకల్లో భాగంగా ఆలయం వద్ద కోలాటం, తప్పెటగుళ్లు, బాల సరస్వతి నృత్య కళామందిర్ ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు. సంస్కృతిక కార్యక్రమాల్లో నిర్వహించబడతాయన్నారు.

యజ్ఞంలా 'ఉల్లాస్' చేపట్టాలి

ప్రజాశక్తి-పద్మనాభం : స్వయంసహాయక సంఘాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేసే ఉల్లాస్ కార్యక్రమాన్ని మహాయజ్ఞంలా చేపట్టాలని ఎంపిపి కె.రాంబాబు పిలుపునిచ్చారు. శనివారం వెలుగు కార్యాలయంలో వాలంటీర్లకు నిర్వహించిన శిక్షణలో మాట్లాడుతూ, సంఘాల్లోని 15-59ఏళ్ల నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. మహిళా గ్రూపుల్లోని నిరక్షరాస్యులను గుర్తించి,వారికి రోజూ రెండు గంటలపాటు అదే గ్రూపులోని వాలంటీర్లతో అక్షరాలు నేర్పిస్తారన్నారు వాలంటీర్లంతా స్వచ్ఛందంగా పనిచేస్తారని, వారికి ఎటువంటి పారితోషికాలు, వేతనాలు ఉండవన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. ఎంపిడిఒ ఎం.విజయకుమార్ మాట్లాడుతూ మండలంలో161 మహిళా సంఘాలకు చెందిన 1608 మందిని నిరక్షరాస్యులకు 161 మంది వాలంటీర్లుతో మొదటి విడతలో అక్షరాస్యులను చేస్తారన్నారు. ఎంపిక చేసిన వాలంటీర్లు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఎం సాయి రమేష్, మండల పరిషత్ సూపరింటెండెంట్ ఉమ, శిక్షణ రిసోర్స్‌పర్సన్ వెంకటలక్ష్మి, ఎంఎస్ఎస్ అధ్యక్షురాలు పి.సూరమ్మ పాల్గొన్నారు.

కార్టూన్లు గీయడంపై శిక్షణ

ప్రజాశక్తి - ఆరిలోవ :బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా విధి బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దీనదయాల్‌పురంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలోని బాలురకు కార్టూన్లతో జీవన నైపుణ్యాలపై శిక్షణనిచ్చారు.. ప్రముఖ కార్టూనిస్ట్, లైఫ్‌స్కిల్ ట్రైనర్ బి.హరి వెంకటరమణ పాల్గొని బాలురకు కార్టూన్లను ఎలా గీయాలో మెళకువలు నేర్పించారు. కెన్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎడ్యుకేషన్ అండ్ అచీవ్‌మెంట్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలురకు డ్రాయింగ్ సామగ్రి, చెస్ బోర్డు అంద జేసారు. గృహం పర్యవేక్షణాధికారి కె.వీరయ్య, కెన్ ఫౌండేషన్ అధ్యక్షులు పి.సంతోష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు తాటిచెట్లపాలెం గెడ్డ డ్రైనేజీ నిర్మాణం, కస్తూరినగర్, శ్రామికనగర్ ఏరియాల్లో రిటైనింగ్ వాల్ పనులను జివిఎంసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, వార్డు పరిధిలో 80శాతం పనులను పూర్తిచేశామని, మిగతా పనులను త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు.కార్యక్రమంలో ఎ వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేష్ , కె.చిన్న ,పాల్గొన్నారు

విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన

ఎఫ్‌పిపిసిఎ ప్రతిపాదనలు తిరస్కరించాలి

ఎపి విద్యుత్ నియంత్రణ మండలికి సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం లేఖ

ప్రజాశక్తి-అనకాపల్లి

2023-24 సంవత్సరానికి విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన ఎఫ్‌పిపిసిఎ ప్రతిపాదనలు తిరస్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి కార్యదర్శికి శనివారం లోకనాథం లేఖ రాశారు. తూర్పు, మధ్య, దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థలు 2023-24 సంవత్సరం ఎఫ్‌పిపిసిఎ (ట్రూ అప్ చార్జీలు) ప్రతిపాదనలపై ఈ నెల 4న బహిరంగ నోటిఫికేషన్ ద్వారా ప్రజల అభ్యంతరాలు, అభిప్రాయాలు కోరారని తెలిపారు. ఈ ప్రతిపాదన వల్ల విద్యుత్ వినియోగదారులపై రూ.11,820 కోట్లు భారం పడుతుందన్నారు. 2023-24 సంవత్సరంలో వినియోగించుకున్న విద్యుత్‌పై యూనిట్‌కు ప్రతినెలా అదనంగా 50 పైసల నుండి 2.50 పైసలు వరకు భారం పడుతుందని పేర్కొన్నారు. నెలరోజుల క్రితమే 6,072 కోట్ల భారం వేసి మరలా దానికి దాదాపు రెట్టింపు భారం మోపడం అన్యాయమన్నారు. ప్రభుత్వం పంపిణీ సంస్థల అసమర్థ విధానాలు, అవినీతి, బడా సంస్థలకు అదనపు చెల్లింపులు, ప్రభుత్వ థర్మల్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి అధిక రేట్లతో బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు చేయటం, సర్ చార్జీలు, వడ్డీలు ఇతర అంశాలు ఈ భారానికి కారణాలని పేర్కొన్నారు. ఈ లోపాలను మండలి ఎత్తిచూపి సరిదిద్దాలని, ప్రజలపై భారం వేయరాదని, అనివార్యమైన అదనపు వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలని సూచించారు. ప్రజలపై అదనంగా విద్యుత్ భారం వేయబోమని, చార్జీలు తగ్గిస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, దానిని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేసారు. 2022-23 సంవత్సరం ట్రూ అప్ చార్జీల రూ.6,072 కోట్లుపై కూడా పునరాలోచన చేసి వాటిని కూడా రద్దు చేయాలని కోరారు. విద్యుత్ వినియోగించుకున్న కొద్ది నెలలు, సంవత్సరాల తర్వాత వినియోగదారుల వద్ద నుండి అదనంగా వసూలు చేసే సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల విధానం లోపభూయిష్టంగా ఉందని, దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పంపుసెట్లకు, గృహాలు, వ్యాపార, పరిశ్రమలు, సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని కూటమి ప్రభుత్వం పెద్దలు గతంలో వ్యతిరేకించారని, దానికి భిన్నంగా నేడు స్మార్ట్ మీటర్లు పెట్టడం సరికాదని హితవుపలికారు. వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించవద్దని ఆదేశాలివ్వాలని కోరారు. 2023-24 చార్జీల ప్రతిపాదనలపై అభ్యంతరాలకు గడువు 15 రోజులు పొడిగించాలని, తదనంతరం దీనిపై బహిరంగ విచారణ జరిపి ప్రజాభిప్రాయాన్ని స్వీకరించాలని డిమాండ్ చేశారు.

కార్తీక పౌర్ణమి జ్వాలాతోరణంలో అపశ్రుతి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక శ్రీసాంబమూర్తి కోవెల వద్ద కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు జ్వాలాతోరణం సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. జ్వాలాతోరణం ప్రబల భక్తులపై పడడంతో అక్కడ చూస్తున్న వారిపై పడడంతో పదిమందికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిలో ముగ్గురు పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. క్షతగాత్రులు ఎన్టీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిని శనివారం 84వ వార్డు టిడిపి ఇన్చార్జ్ మాదం శెట్టి నీలబాబు పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించి వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడే విధంగా సహకారం అందించాలని నీలబాబు కోరారు. గాయపడిన మినరాన శ్రీనివాస్, ఏడువాకుల శ్రీను, బి సంతోష్‌తో మాట్లాడారు. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, పీలా గోవింద సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లి సహకారం అందించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీకాకుళం గణపతి, తలారి లక్ష్మీప్రసాద్, చింతపల్లి కొండబాబు పాల్గొన్నారు.

జిల్లా వాసులకు గౌరవ డాక్టరేట్లు

ప్రజాశక్తి-పరవాడ, వద్దాది : అనకాపల్లి జిల్లాకు చెందిన ఇద్దరికి సోషల్ సర్వీస్ కేటగిరీలో న్యూఢిల్లీకి చెందిన ఆసియా వేదిక ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. శుక్రవారం హైదరాబాద్ కళాభారతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని పరవాడ ప్రాంతానికి చెందిన రియా ఫౌండేషన్ చైర్మన్, సీనియర్ జర్నలిస్ట్ ఎమ్.డి.రాజు, బుచ్చయ్యపేట మండలం పొట్టి దొరపాలెనికి చెందిన ఆర్ఎంపీ వైద్యులు వడ్డి సత్యారావు ఈ గౌరవ డాక్టరేట్ పురస్కారాలను అందుకున్నారు. రియా ఫౌండేషన్ ద్వారా సమాజానికి చేసిన సేవలకు గాను ఎమ్‌డి రాజుకు, ఎస్ఎస్ఆర్ సేవా సంస్థ చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు గాను వడ్డి సత్యారావుకు ఈ డాక్టరేట్లు అందించారు.

జూడో పోటీలకు డిగ్రీ కాలేజీ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం బిఎస్సీ కంప్యూటర్స్ చదువుతున్న శీలంశెట్టి మధు అంతర విశ్వవిద్యాలయాల జూడో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతామహాలక్ష్మి తెలిపారు. ఎయు అంతర్ కళాశాలల పోటీల్లో జూడో 60 కేజీల విభాగంలో మధు ప్రతిభ కనబర్చి జార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగే క్రీడా పోటీలకు ఎయు తరుపున ఎంపికయ్యారు. ఈ మేరకు మధును ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు శనివారం అభినందించారు.

ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో చేపడుతున్న పనుల్లో నాణ్యత పాటించి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఆర్.పూర్ణిమాదేవి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శాఖల వారీగా మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. పల్లె పండుగ కార్యక్రమంలో ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, ఈవోపీఆర్డీ రమణి, మండల ఇంజనీర్ సుమతి, ఎంఈఓ 1, 2 కె.సత్యనారాయణ, ప్రసాద్ ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో అప్పలరాజు పాల్గొన్నారు

దేవాలయాల చైర్మన్లకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో పలు దేవాలయాలకు చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయబోతున్న కూటమి పార్టీ నాయకులను రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర శనివారం సత్కరించారు. శ్రీ భోగ లింగేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్‌గా ఎస్ఎఫ్ఇ సత్యనారాయణ, శ్రీ సత్యనారాయణ మూర్తి దేవస్థానం చైర్మన్‌గా అప్పికొండ గణేష్, శ్రీ సుంకర మెట్ట దేవస్థాన చైర్మన్‌గా బొడ్డేడ మురళి, దేవాలయ కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాడి బుజ్జి, దాడి వాసు, విల్లూరు రాజేష్, కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మల్ల శ్రీను, మేడిశెట్టి నూకరాజు, మేడిశెట్టి సత్తిబాబు, కొన శ్రీను, ఎస్.భాను చందర్, షేక్ రియాజ్ సంధ్యాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల చైర్మన్లను సత్కరిస్తున్న మల్ల సురేంద్ర

రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండలం ఔరువాడ పంచాయతీ సీతలబందలో నేషనల్ గ్రానైట్ క్వారీ ప్రమాదంలో మృతి చెందిన కిముడు రాము కుటుంబానికి 50 లక్షల రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కే శంకర్రావు, జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము మాట్లాడారు. కంప్రెషర్ ట్రాక్టర్ బోల్తా పడి రావికమతం మండలం ఔరువాడకి చెందిన కిముడు రాము మృతి చెందారని తెలిపారు. ఇటీవల క్వారీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడానికి సరైన చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కార్మికులు ప్రమాదాల బారిన పడినా ఎటువంటి సమాచారం లేకుండా తరలించడం జరుగుతుందన్నారు. తక్షణమే మైనింగ్ అధికారులు, కార్మిక శాఖ అధికారులు క్వారీల్లో తనిఖీ చేసి క్వారీల్లో భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సొసైటీ సభ్యులకు పొదుపు నగదు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : పదవీ విరమణ పొందనున్న పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు పోలీస్ సంక్షేమ కోఆపరేటివ్ సొసైటీలో దాచుకున్న నగదు చెక్కులను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తన కార్యాలయంలో శనివారం అందజేశారు. ఉమ్మడి జిల్లాలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పోలీసు సంక్షేమ కోఆపరేటివ్ సొసైటీలో సభ్యులుగా ఉన్నవారు రిటైర్మెంట్ దగ్గర్లో ఉన్న కారణంగా కో ఆపరేటివ్ సొసైటీ కి ప్రతినెల వారి జీతం నుండి నెలకు రూ.1000 చొప్పున వసూలు చేసిన మొత్తాన్ని ఏఆర్ హెచ్‌సి ఆర్.శ్రీరామ్‌మూర్తికి రూ.1,72,900, ఏఆర్ హెచ్‌సి పి.శ్రీనివాసరావుకు రూ.1,44,200, ఏఎస్సై పి.చిన్నయ్య మరణాంతరం అతని భార్య మచ్చుమ్మకు డెత్ రిలీఫ్ ఫండ్‌తో కలిపి రూ.2,05,500, వ్యక్తిగత అవసరాల నిమిత్తం సభ్యత్వం విరమించుకున్న హెచ్‌సి ఎం.విక్టర్ బాబు రూ.1,38,500 నగదు చెక్కులను జిల్లా ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఇన్స్పెక్టర్ బి.రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో శనివారం తుమ్మపాల, పెరుగు బజారు, చిన్నవీధి తదితర గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రం అయినప్పటికీ ఎటువంటి ఉపాధి అవకాశాలు పెరగలేదన్నారు. బెల్లం మార్కెట్ రోజు రోజుకి కుచించుకు పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 18వ తేదీ అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద జరుగు నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి ఉమా మహేశ్వర రావు, కె తేలయ్యబాబు, గండినాయన బాబు, జి. సుభాషిణి, బుగిడి నూక అప్పారావు పాల్గొన్నారు.

మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు శ్రీరామ్ తదితరులు

ఉద్యోగ సాధనే లక్ష్యంగా కష్టపడి చదవాలి

కరెంట్ ఎఫైర్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా కష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. డిఎస్‌సి పరీక్షకు హాజరయ్యే బిసి, ఎస్‌సి, ఎస్‌టి, ఈబిసి కులాలకు చెందిన అభ్యర్థులకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ గౌరీ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని శనివారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకొని కష్టపడి చదివితే ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ యుగంలో దానిని మన అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని, సోషల్ మీడియాకు బానిస కాకూడదని హితవుపలికారు. విద్యకు, ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నదని తెలిపారు. శిక్షణ కేంద్రంలో 220 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో 75 శాతం హాజరు నమోదు ఉన్న అభ్యర్థులకు నెలకు రూ.1500 స్టైపెండ్, డీఎస్సీ మెటీరియల్ కోసం వేయి రూపాయలు అందజేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంటు ప్రొఫెసర్ ఎ.అర్జున అప్పారావు రూపొందించిన ఏకలవ్య కరెంటు ఎఫైర్స్ పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం డైరెక్టర్ కె.రాజేశ్వరి, డిఇఒ జి. అప్పారావు నాయుడు, ఆహార, పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ, ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జోగారావు, గౌరీ లైబ్రరీ సంఘం అధ్యక్షులు కె.వి.రమణ పాల్గొన్నారు.

'యువ ఉత్సవ్-2024' వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక గౌరీ గ్రంథాలయంలో 'యువ ఉత్సవ్-2024' వేడుకలను శనివారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతలో ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన, సృజనాత్మకత, సామూహిక చైతన్యాన్ని, దేశ భక్తిని పెంపొందించుటకు యువజన ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. యువత వారి సాంప్రదాయ కళలు, నృత్యాలు, సంగీతం, నాటకాలు వంటి అంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువత ఒకే వేదికపై కలవడం ద్వారా వారికి సామాజిక సమగ్రత, ఇతరుల సంస్కృతులపై గౌరవభావం కలుగుతుందని పేర్కొన్నారు. టెక్నాలజీ ప్రదర్శనలు, స్టార్టప్ ఐడియాలు భాగస్వామ్యంగా ఉండడం ద్వారా యువత తమ సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించవచ్చని తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ డిడి కె.రాజేశ్వరి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువఅధికారి జి.మహేశ్వరావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో సైన్స్ మేళా (వ్యక్తిగతం, గ్రూపు), యువ రచయితల పద్యాలు, పెయింటింగ్, ఫోటోగ్రఫీ, డిక్లమేషన్, సాంస్కృతిక, సంప్రదాయక ప్రదర్శనల పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ కె.తామస్ రవికుమార్, ఎన్యైకె రాష్ట్ర సలహా కమిటీ మాజీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫసర్ డాక్టర్ ఎం.జోగారావు, వివిధ పాఠశాలల విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

పెదముషిడివాడలో అక్రమాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పరవాడ : అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పెదముషిడివాడ గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అదే పంచాయతీకి చెందిన బర్ల శంకర్రావు తదితరులు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో సిసోడియాను కలిసి పలు ఆధారాలతో కూడిన ఫిర్యాదును అందజేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమణ, రీ సర్వేలో భాగంగా వెబ్ ల్యాండ్‌లో ఇష్టానుసారంగా పేర్లు మార్పిడి, ల్యాండ్ పూలింగ్‌లో అక్రమాలు, అక్రమ మైనింగ్, అనధికార లే అవుట్లు తదితర వాటిపై ఫిర్యాదు చేశారు.

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి

ఆర్‌డిఒకు ప్రజా సంఘాల నేతలు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ బాధితుల సమస్యలు పరిష్కరించాలని శనివారం అనకాపల్లి ఆర్డీవో ఆయేషాకు ప్రజా సంఘాలు నాయకులు వినతిపత్రం అందజేశారు. అచ్యుతాపురం నుండి మునగపాక మీదుగా అనకాపల్లి బైపాస్ వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణకు ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పంట భూములు, ఇల్లు, షాపులు కోల్పోయి పలువురు నిర్వాసితులవుతున్నారని తెలిపారు. అయితే భూములు కోల్పోతున్న వారి పేర్లు లిస్టులో తప్పులు ఉన్నాయని, జిరాయితీ భూములలో ఇల్లు, షాపులు కోల్పోతున్న అనేక మందికి పేర్లు ఇప్పటికీ నమోదు చేయలేదని, వాటన్నింటినీ సరి చేసి ఫైనల్ లిస్ట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణలో పూర్తిగా ఇల్లు, షాపులు కోల్పోయిన వారికి ముప్పావు శాతం పోయినవారికి స్థలాలు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం ప్యాకేజీ ఇవ్వాలని, రోడ్డు కిరువైపులా ఏళ్ల తరబడి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం గడుపుతున్న వారికి పరిహారం ఇవ్వాలని కోరారు. కొబ్బరి మొక్కలు, బోర్లు నేటికీ సర్వే చేయలేదని, ఈ సమస్యలు పరిష్కరించిన తర్వాతే నిర్వాసితుల వద్ద సంతకాలు సేకరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.రామ సదాశివరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు మునగపాక మండల కార్యదర్శి కె.బ్రహ్మాజీ, ఎస్ఇజెడ్ నిర్వహిస్తున్న సంక్షేమ సంఘం అధ్యక్షులు బుద్ద రంగారావు, ఎస్.కనుమనాయుడు, రోడ్డు విస్తరణ బాధితుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఆర్.రాము పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి

మునగపాక : అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు మార్గం విస్తరణలో భూములు, గృహాలు కోల్పోతున్న నిర్వాసితులకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారంగా నష్టపరిహారం అందచేయాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పిఏసిఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం మునగపాక గ్రామ నిర్వాసితుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాసితుల సంఘం నాయకులు మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం ఇంటి స్థలం గజానికి రూ.18,504, పంట భూమి గజానికి రూ.11 వేల చొప్పున రెవిన్యూ సిబ్బంది ఒప్పందం కుదుర్చుకోగా, సకాలంలో బాధితులకు నష్టపరిహారం అందించలేదని తెలిపారు. ఇటీవల రెవిన్యూ అధికారులు సమావేశాలు నిర్వహించి గతంలో ఇచ్చిన నష్టపరిహారం అందజేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రెండేళ్ల తర్వాత రిజిస్ట్రేషన్ వ్యాల్యూ పెరగడంతో ఇప్పటి రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం గజానికి సుమారు రూ.24 వేలు చొప్పున నష్టపరిహారం పంపిణీ చేయాలని, 25 సంవత్సరాల పాటు ఏ విధమైన విస్తరణ చేపట్టకూడదని, ఇల్లు కోల్పోతున్న బాధితులకు తప్పనిసరిగా ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో బొడ్డేడ సోమసుందర్రావు, పెంటకోట సోమ సత్యనారాయణ, పెంటకోట జగన్నాథం, ఆడారి అప్పలనాయుడు, వేగి వీరునాయుడు, సూరిశెట్టి కన్నారావు, పెంటకోట నాయుడు, అజయ్, నాయుడు అప్పు, సూరిశెట్టి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మాతపడిన మద్యం షాపు

రెండు మద్యం దుకాణాలు మూత

ప్రజాశక్తి-చోడవరం : మద్యం షాపులు ఏర్పాట్లు విషయంలో వ్యాపారుల మధ్య తలెత్తిన వివాదంలో రాజకీయ జోక్యంతో ఎక్సైజ్ అధికారులు ఎటు తేల్చుకోలేక అడకత్తెరలో పోక చెక్క చందంగా మారడంతో శనివారం పాత ఎల్‌బిసి పరిసర ప్రాంతంలో ఉన్న రెండు మద్యం షాపులను మూయించారు. చోడవరం మండలంలో 8 షాపులకు టెండర్లు ఖరారు చేశారు. వాటిలో మూడు రూరల్ పరిధిలోనూ, ఐదు షాపులు పట్టణంలోనూ ఏర్పాటు చేశారు. చోడవరం మెయిన్ రోడ్‌లో మూడు షాపులు, పాత ఎల్‌బిసి కార్యాలయం సమీపంలో రెండు షాపులు ఏర్పాటు చేయగా, వివాదమంతా ఈ రెండు షాపుల వద్ద జరుగుతుంది. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న స్వయంభు విగ్నేశ్వర ఆలయానికి 100 మీటర్ల దూరానికి లోబడి ఉన్నాయని వివాదం ప్రారంభం కాగా, ఎక్సైజ్ అధికారులు కొలతలు నిర్వహించగా ఒక షాపు 100 మీటర్ల పైబడి దూరంలోనూ, మరో షాపు 100 మీటర్ల లోబడి దూరంలోనూ ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ నిబంధనలకు అతిక్రమిస్తే ఊరుకునేది లేదని షాపు యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. షాపులు ఏర్పాటై నెల రోజులు కావస్తున్నా అప్పటి నుండి ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య చర్చలు కొనసాగినా, ఇందులో అధికార ప్రతిపక్ష పార్టీలవారు ఉండడంతో వ్యాపారంలో పోటీ ఏర్పడి ఎవరు తగ్గడం లేదు. దీంతో అధికారులు ఎటూ నిర్ణయం తీసుకోలేక షాపులను మూసి వేయించారు.

108 ఉద్యోగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-కశింకోట : 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల తహశీల్దారు శ్రీనివాసరావుకు 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. టిడిపి కూటమి ప్రభుత్వానికి తమ సమస్యలపై పలు దఫాలుగా వినతులు ఇచ్చామని, వెంటనే సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 25వ తేదీ నుంచి 108 సేవలను బంద్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో 108 ఉద్యోగులు అప్పికొండ రామకృష్ణ, ఆర్.శివ, ఎస్.చంద్రమౌళి పాల్గొన్నారు.

సీవేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి-యలమంచిలి : మున్సిపాలిటీలో మురుగు నీటిని శుద్ధి చేయడానికి సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ నిర్మాణానికి ప్రతిపాదిత స్థలాలను శనివారం అనకాపల్లి ఆర్‌డిఒ ఆయేషా, స్థానిక మండల తహశీల్దార్ వరహాలు, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఆర్ఐ విష్ణు పరిశీలించారు. కట్టుపాలెం, కొత్తపాలెం, రామారాయుడు పాలెం, కొక్కిరాపల్లి ప్రతిపాదిత ప్రాంతాలను సందర్శించారు. అనువైన ప్రాంతాలను ఎంపిక చేస్తామని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు.

సిసి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని వెదురుపర్తి, కశింకోట సత్తెమ్మతల్లి కాలనీ, కొత్తపల్లి, తేగాడ గ్రామాల్లో సిసి రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో వివి రవికుమార్ శనివారం పరిశీలించారు. ఈ నెలాఖరులకు సిసి రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాస్, ఏపిఒ శ్రీనివాసరావు, సిబ్బంది శివాని, కుమారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో గల రాజాం గ్రామంలో వరి పొలాలను బుచ్చయ్యపేట మండల వ్యవసాయ శాఖ అధికారి బి భాస్కరరావు శనివారం పరిశీలించారు. వరి పొలాల్లో అక్కడక్కడా మానిపండు తెగులు ఉన్నట్లు గుర్తించారు. ఈ తెగులు సోకిన పొలంలో వరి కంకిలో కొన్ని గింజలు పసుపు, నారింజ రంగులోకి మారి తరువాత గుండ్రని, నల్లని గింజగా మారి కనిపిస్తుందని తెలిపారు. తెగులు ఉధృతి ఎక్కువగా కాకుండా నివారణకు వెంటనే ప్రొపికొనాజోల్ 1ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ సంతోష్, రైతులకు పాల్గొన్నారు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

పాఠశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం పట్టణంలోని కెటోర్నీ పాఠశాల ఆవరణలో స్కూల్ చైర్మన్ నేమాల హరి ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. పాఠశాల ఆవరణలోనూ పిచ్చి మొక్కలను తొలగించి ఇందిరాగాంధీ పార్కు వద్ద కాలువలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు సూచన మేరకు పట్టణంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఈఓపిఆర్‌డి మహేష్, పంచాయతీ ఈవో నారాయణరావు, టిడిపి నాయకులు గునూరు మల్లునాయుడు, గూనూరు పెదబాబు, దేవరపల్లి వెంకటప్పారావు, ఎంపిటిసి పాలెం నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని సబ్బవరం సచివాలయం-2 పరిధి ఆదిరెడ్డిపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ పాల్గొని పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తను తొలగించారు. అనంతరం పారిశుధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డి చైతన్య, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, ఆదిరెడ్డి రమణ, కోటాన అప్పారావు, కోటాన కోటేశ్వరరావు, గొర్లి కనకం పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్వచ్ఛ హీ తా సేవ కార్యక్రమంలో భాగంగా దేవరాపల్లి అంబేద్కర్ కాలనీ సమీపంలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని, ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన తుప్పలను తొలగించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎస్ మంజుల వాణి, ఎంపీడీవో ఎంవి సువర్ణరాజు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి చంద్రశేఖర్, హౌసింగ్ ఇంజనీర్ అవినాష్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ విపివి త్రినాథ్, పంచాయతీ కార్యదర్శి మంగపతి పాల్గొన్నారు.

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీలో ప్రతి శనివారం ఉదయం ఒక గంట పాటు మాస్ క్లీన్‌నెస్ కార్యక్రమం ఉంటుందని కమిషనర్ ప్రసాదరాజు అన్నారు. ఆయన శనివారం ఉదయం నెహ్రూనగర్, ఎస్సీ రింగ్ రోడ్డు పార్క్ ఏరియాలో చేపట్టిన స్వచ్ఛతా హి కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ పిచ్చి తుప్పల్ని తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాస్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లిలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని జర్నలిస్టు యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, ఆసుపత్రి సూపరిటెండెంట్ శిరీష చేతుల మీదుగా రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దవరసింగి రాంబాబు,పెంటయ్య, మురళి, నవర రమణబాబు, కొవిరి వెంకటేష్, బాబ్జి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే నర్సీపట్నం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు జర్నలిస్టులు పండ్లు పంపిణీ చేశారు. నర్సీపట్నం డి.ఎస్.పి మోహన్‌రావు, టౌన్ సిఐ గోవిందరావు, రూరల్ సిఐ రేవతమ్మలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు స్వామి, కిషోర్, బాబ్జి, అప్పారావు, ఎడి బాబు, శ్రీనివాసవర్మ, శివ సత్యనారాయణ, నాగేశ్వరరావు వైశాకి రామకృష్ణ, గిరిబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం స్థానిక అతిథిదేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ పత్రిక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుడు అరిపాక కామేశ్వరరావు, ఇన్ఛార్జి ప్రిన్సిపల్ కేవి.విజయ్ కుమార్, అధ్యాపకులు ప్రభ, ముత్యాలమ్మ, నరసింహమూర్తి, సుధీర్, సునీత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యలమంచిలి : యలమంచిలిలో జాతీయ పత్రికా దినోత్సవం శనివారం ఘనంగా జరుపుకున్నారు. విలేకర్లంతా ప్లకార్డులు ధరించి తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి గంగాధర్, రుద్ర చిట్టిబాబు, పెద్దింటి సూర్యనారాయణమూర్తి, నగిరెడ్డి సత్యనారాయణ, శివ, రాజు, చిన్నాజీ, సంతోష్, ప్రసాద్, నాయుడు, వెంకట్రావు, రాము, శ్రీను, లోకేశ్, గణేశ్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలంలోని కెబి రోడ్డులో పరిమితికి మించిన లోడుతో వాహనాలు తరచూ రాకపోకలు సాగిస్తున్నాయి. శనివారం ఉదయం గ్రానైట్ వ్యర్థాల లోడుతో వెళుతున్న లారీ నీలకంఠాపురం సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో విద్యుత్ స్తంభం ధ్వంసమైంది. ఈ సమయంలో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి స్తంభాన్ని ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ, సాయినగర్‌లో గుడ్ల నాని ఇంటి దగ్గర నుండి రొంగలి నాని ఇంటి వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులకు శనివారం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు శంకుస్థాపన చేశారు. పంచాయతీ నిధులు రూ.3.50 లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బైలపూడి దేముడు బాబు, గొర్లి చైతన్య, పిఏసిఎస్ వైస్ చైర్మన్ పల్లా కృష్ణ, వార్డ్ మెంబర్లు టి.శేఖర్, చిత్రాడ శ్రీను, కొల్లి కృష్ణ, జెట్టి ప్రసాద్, గుడ్ల నాని పాల్గొన్నారు.

ఆటో మోటార్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -అనకాపల్లి : ఆటో మోటార్ కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని కోరుతూ ఏఐటియుసి ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లి ఆర్డీవో ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వైఎన్ భద్రం, కే త్రినాథ, కోరిబిల్లి శంకర్రావు, కొలుసు రాంబాబు, ఎం దేవుళ్ళు, ఎస్ రమణ, కే రాజు,అప్పలనాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కశింకోట : ఆన్‌లైన్ మోసాలు పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సిఐ అల్లు స్వామి నాయుడు అన్నారు. కశింకోట విశ్వభారతి జూనియర్ కాలేజీలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గంజాయి, సైబర్ నేరాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-పరవాడ : పరిశ్రమలలో ప్రమాదాలను నివారించడానికి, అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ఎదుర్కోవడానికి కార్మికులు అవగాహన కలిగి ఉండాలని జాతీయ విపత్తు స్పందన దళం 10వ బెటాలియన్ టీం కమాండర్ వై.సత్యనారాయణ తెలిపారు. శనివారం పరవాడలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, సువెన్ ఫార్మా కర్మాగారాలలో సిబ్బందికి, కార్మికులకు ప్రమాదాల సమయంలో పాటించవలసిన జాగ్రత్తలు, తక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఎల్‌బిపి అగ్రహారంలో రెవెన్యూ గ్రామసభ

ప్రజాశక్తి-వడ్డాది : మండలంలోని ఎల్‌బిపి అగ్రహారం గ్రామంలో తహసీల్దార్ లక్ష్మీ ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. భూ రీ సర్వేలో సమస్యలపై రైతులు నుండి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమరాన దాసు, ఎంపీటీసీ యల్లపు జగ్గారావు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి -నక్కపల్లి:విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముందుగా పలు జిల్లాలలో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహ అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారన్నారు.విద్యుత్ వినియోగదారుల అనుమతి లేకుండా నివాస గృహాలకు మీటర్లు బింగించడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఎక్కడా స్మార్ట్‌మీటర్లు బిగించినా ప్రజలందరూ ప్రతిఘటించాలని కోరారు. వైసిపి ప్రభుత్వం

మాట్లాడుతున్న అప్పలరాజు

పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని, మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చివారే నేడు మీటర్లు బిగిస్తుండంతో ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు.అదాని, షిర్డీ సాయి సంస్థలతో కుమ్మక్కయ్యి, వేలాది కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడి ఒప్పందాలు చేసుకొని మీటర్లు పెడుతున్నారని విమర్శించారు.ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలందరిపై భారం పెరుగుతుందని,ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాల్సి వస్తుందన్నారు. ప్రతి మీటర్ కు అయ్యే వ్యయం 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వేలాది రూపాయలు వినియోగదారుల నుండే వసూలు చేస్తారన్నారు. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.సత్యనారాయణ, కోడా కాశీరావు, ఎం.బాపూజీ, పి.దావీదురాజు, సి.హెచ్.అప్పలరాజు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు పోటీలు

రోలుగుంటలో వ్యాస రచన రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాధికారి రాజుబాబు ఆద్వర్యంలో శనివారం గ్రంథాలయ ప్రముఖులకు నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 60 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల నుండి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీడికాడ:స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాల నుండి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథాలయ అధికారి జోగేశ్వరి తెలిపారు. ప్రజాశక్తి కోటఉరట్ల, చిన్నారులు చిత్రలేఖనంపై దష్టి సారించాలి.. విద్యార్థి దశ నుంచే చిన్నారులు చిత్రలేఖనంపై దష్టి సారించాలని శనివారం శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు అన్నారు, 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ప్రముఖులకు నివాళులు అర్పించిన అనంతరం విద్యార్థులతో పోటీలు నిర్వహించారు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన 55 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కోటవురట్ల:విద్యార్థి దశ నుంచే చిన్నారులు చిత్రలేఖనంపై దృష్టి సారించాలని గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు అన్నారు, విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన 55 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమ నాయకుల సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.త్రిమూర్తులు మాట్లాడుతూ, గాడి చర్ల హరి సర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణయ్య ఆంధ్రదేశ్ గ్రంథాలయాల స్థాపనకు విశేష కృషి చేశారని కొనియాడారు. ఆ తర్వాత క్రమంలో వావిలాల గోపాలకృష్ణయ్య, పాతూరు నాగభూషణం, వెలగా వెంకటప్పయ్య వంటి వారు ఆ కృషిని కొనసాగించారన్నారు. విశ్రాంత లైబ్రేరియన్ కన్నబాబు మాట్లాడుతూ, గ్రంథాలయాల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ దమయంతి, విశ్రాంత లైబ్రేరియన్ జి. మురళీకృష్ణ, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

రోలుగుంట:స్తానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయాధికారి ఎస్.వరలక్ష్మి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్ఆర్.రంగనాథ్, పాతురి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు నివాళి అర్పించారు. అనంతరం విద్యార్దులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు శ్యామల, రేవతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమ నేతలు చిరస్మరణీయులు

యలమంచిలి : యలమంచిలి శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమ నేతలు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ సంస్మరణ కార్యక్రమంలో భాగంగా వారి చిత్ర పటాలకు డిగ్రీ కాలేజి మాజీ వైస్ ప్రిన్సిపాల్ పూరి జగన్నాథం పూలమాల వేసి వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయులు ఎ.సన్యాసిబాబు, ఎం.సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ కె.దుర్గారావు, గ్రంథాలయాధికారి వి.ఆనంద్ పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ నేతలు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పుస్తక విభాగాలను విద్యార్థులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎల్వి రమణ, పాఠకులు కరుణాకర్, బి గణేష్ నాయుడు, దివ్యశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరవాడ : స్థానిక శాఖ గ్రంథాలయం ఆవరణలో రికార్డు అసిస్టెంట్ కెవి లక్ష్మణరావు ఆధ్వర్యంలో శనివారం 7, 8, 9 తరగతి విద్యార్థులకు పర్యావరణం పరిశుభ్రత, కాలుష్యంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఐదవ తరగతి విద్యార్థులకు చైర్స్ గేమ్ ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కాండ్రేగుల వెంకట రామారావు, జంగాల నాగేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వి శిరీష కుమారి ఆధ్వర్యంలో క్విజ్, చదరంగం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ కాలేజీ లెక్చరర్‌లు రామారావు, ప్రసాద్, ఉపాధ్యాయులు పాణి టీచర్, జోష్నా, మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వరలక్ష్మి, సిస్ట అప్పారావు, బొడ్డేడ బలరామస్వామి విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ శాఖ గ్రంథాలయంలో శనివారము గ్రంథాలయ ఉద్యమ నేతల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమం గ్రంథాలయాధికారి ఎం పద్మావతి, పాఠకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక శాఖ వీధి ప్రభుత్వ శాఖా గ్రంథాలయం ఆధ్వర్యాన స్థానిక గాంధీనగరం సాయిశక్తి స్కూల్‌లో విద్యార్థులకు 'గ్రంథాలయాలు-విద్యార్థుల విజ్ఞాన వీచికలు" అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు, సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగ భూషణం, అరసం జిల్లా అధ్యక్షులు జివిఎల్ఎన్.శాస్త్రి, స్కూల్ కరస్పాండెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వి.కృష్ణారావు ఆధ్వర్యంలో చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జాజి మొగ్గల ఇంగ్లీష్ మీడియం స్కూలుకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాలపట్నం:గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని, గోపాలపట్నం కళాసేవాపీఠం అధ్వర్యాన స్థానిక ఉన్నతపాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు, అధ్యక్షుడు గొరపల్లి బంగర్రాజు, మాజీ అధ్యక్షుడు చందు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొంతం నూకరాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఆనందపురం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పాటల పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ బివిఎస్ అప్పారావు, హైస్కూల్ తెలుగు పండితులు మహేష్ పాల్గొన్నారు.

గోపాలపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఎస్ఆర్.రంగనాధన్, పాతూరి నాగభూషణం వంటి గ్రంథాలయోద్యమ నాయకుల చిత్రపటాలకు ఐటిఐ రిటైర్డు టీచర్ దామరాజు విశాలక్షి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వల్లనచేశారు,

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమ నేతల చిత్రపటాలకు శని వారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ ఎస్.మహేష్ ఆశ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఇంజనీర్ చంద్రశేఖర్, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా

ప్రజాశక్తి-గొలుగొండ: మండల కేంద్రంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ బి.సత్యనారాయణ, వెలుగు ఏపిఎం కరుణానిధి, ఇన్‌చార్జ్ ఈఓపిఆర్‌డి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కోటవురట్ల:స్వచ్ఛతేహి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అపారిశుద్ధ్యంపై సచివాలయ అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని కంచుగుమ్మల గ్రామంలో శనివారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు కాలువల్లో పూడిక తీత పనులు చేయించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఒ వి.సూర్య నాగేశ్వరరావు పర్యవేక్షించి మాట్లాడారు. గ్రామస్థులు ఎవరు చెత్తను రోడ్డుపై వేయరాదన్నారు. జేఈ వెంకట్రావు, సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థికి మెమెంటోను ఇస్తున్న ఉపాధ్యాయులు

పద్యపఠనం పోటీల్లో విద్యార్థిని సత్తా

ప్రజాశక్తి -నక్కపల్లి:ఈనెల 14 న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పి.ఆర్.టి.యు ఆధ్వర్యంలో నర్సీపట్నం కేంద్రంగా నిర్వహించిన జిల్లాస్థాయి బాలల విజ్ఞాన ప్రతిభా పోటీలలో సీనియర్స్ విభాగంలో పద్యపఠనం పోటీలలో పెదబోదుగల్లం హైస్కూల్ 8 వ తరగతి విద్యార్థిని జెరీనా కౌసర్ ప్రథమస్థానం సాధించినట్లు తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చోడిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ప్రసాద్

ప్లాస్టిక్ నియంత్రణపై చైతన్యపరచాలి

ప్రజాశక్తి -నక్కపల్లి :వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే ప్రక్రియతో పర్యావరణ సుస్థిర అభివృద్ధి జరుగుతుందని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ డైరెక్టర్ (రిటైర్డ్), - డాక్టర్ వి.ఎస్.ఆర్.కే ప్రసాద్ అన్నారు. పాయకరావుపేట శ్రీ ప్రకాష్‌స్పెసెస్ డిగ్రీ కళాశాలలో శనివారం పర్యావరణ సమస్యలు, సుస్థిర అభివృద్ధి అనే అంశం పై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే ప్రక్రియ అభివృద్ధి చేసినట్లయితే కొంతవరకు వ్యర్థాలను తగ్గించవచ్చున్నారు. శిలాజ ఇంధనాన్ని వాడుకుండే క్రమంలో కూడా ఎక్కువగా కాలుష్యం ఉత్పత్తి అవుతుందన్నారు. వ్యర్థాల నిర్వహణ పై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి యువత ముందుకు రావాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను నిరోధించవలసిన బాధ్యత కూడా యువత తీసుకోవాలని అయన సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, శాస్త్రవేత్త నగేష్, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, ప్రిన్సిపల్ రామకృష్ణా రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

తమ్మయ్యకు నివాళి

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లికి చెందిన సిపిఎం నాయకులు కామ్రేడ్ ముద్దా తమ్మయ్య వర్థంతి సందర్భంగా శనివారం నక్కపల్లిలో ఆయన స్థూపం వద్ద చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముద్దా తమ్మయ్య ఆనాటి ప్రభుత్వం తీసుకున్న కల్లు నిషేధానికి వ్యతిరేకంగా కల్లు గీత కార్మికులకు అండగా ఉండి పోరాడారని, దీంతో నిర్బంధానికి గురిచేసి ఆయన కు కరెంట్ షాక్ ఇచ్చి హత్య చేసిందని తెలిపారు. ఈ ప్రాంతం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పిశెట్టి వీరబాబు, కోసూరి శ్రీనివాసరావు, అడ్డూరి లోవరాజు, పెద్దిరెడ్డి రమేష్, అల్లాడి తాతారావు, ముద్దా రాజు, కోసూరి నాని బాబు, బత్తుల రమణ, దేవర వీరబాబు, సకుర అప్పారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

-విషాదంలో కుటుంబ సభ్యులు - రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి : సిపిఎం

రాము మృతదేహం

ప్రజాశక్తి - మాడుగుల:క్వారీలో పని చేస్తూ గిరిజన యువకుడు మృత్యువాత పడిన సంఘటన మాడుగుల మండలం ఆవురవాడ పంచాయతీ శివారు సీత బంధల గ్రానైట్ క్వారీలు చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే... కిముడు రాము (35) తన భార్య ఇద్దరు పిల్లలతో రావికమతం మండలం గుడ్డి బంద గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఔరవాడ పంచాయతీ సీత బంధల గ్రానైట్‌లో గత కొన్నాళ్లుగా ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం ఉదయం గ్రానైట్ క్వారికి పనిలోకి వెళ్ళాడు. గ్రానైట్ క్వారీలో డ్రిల్లింగ్ చేసేందుకు గాను ట్రాక్టర్ను తీసుకెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పెద్ద గుది బండ రాయి ఎక్కి ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ కింద పడిన రాము అక్కడికక్కడే మతి చెందాడు. దీంతో సమాచారం తెలుసుకున్న భార్య పిల్లలతో పాటు కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం తెలుసుకున్న సిపిఎం మాడుగుల మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి అక్కడికి చేరుకొని గిరిజనులు కావడంతో గ్రానైట్ క్వారీ యజమానులు పట్టి పట్టనట్టుగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మృతుడు కుటుంబానికి 50 లక్షల రూపాయలు పరిహారం అందించాలని, కుటుంబంలో భార్యకు జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే క్వారీ వద్ద ఉద్యమం చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.

శనివారం ఉదయం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన ఘటనపై మాడుగల పోలీసులకు సమాచారం అందించినప్పటికీ కేసు నమోదు చేయకుండా తాత్సర్యం చేశారంటూ విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఈ విషయమై ఎస్సై ని వివరణ కోరగా కుటుంబ సభ్యులు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని బదులిచ్చారు..

రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి : సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం నేత గోవిందరావు

ప్రజాశక్తి - కొత్తకోట:నేషనల్ గ్రానైట్ క్వారీలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మతి చెందిన ఆదివాసీ గిరిజనుడు కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు కె. గోవిందరావు డిమాండ్ చే శారు. శనివారం స్థానిక విలేకరులలతో ఆయన మాట్లాడుతూ రావికమతం మండలం బుడ్డిబంద గ్రామానికి చెందిన ఆదివాసి గిరిజనుడు కిముడు రాము (33) మాడు గుల మండలం అరువు వాడ రెవెన్యూ పరిధి సీత బందుల సమీపంలో నేషనల్ గ్రానైట్ క్వారీ లో గత కొన్నాళ్ళుగా ట్రాక్టర్ కం పర్సన్ ఆపరేటర్ గా పని చేస్తున్నాడన్నారు. శనివారం విధులు నిర్వహిస్తున్న రాముపై ట్రాక్టర్ పడి పోవడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందాడని వాపోయారు. క్వారీ లో భద్రతా ప్రమాణా లు పాటించక పోవడంతో గిరిజనుడు మృతి చెందాడని గోవిందరావు ఆందోళన వ్యక్తం చేశారు.మధ్యాహ్నం సుమారు 12 గంటలకు ప్రమాదం జరిగినా పట్టించుకునే నాథుడు లేదని విమర్శించారు. .ఈ క్వారీలో కార్మిక చట్టాలు అమలు కావడం లేదని, కార్మికులకు కనీసం ఇన్సూరెన్స్ కూడా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యం వ్యవరించడం దగదన్నారు. స్పందించా ల్సిన లేబర్ డిపార్ట్మెంట్ మైనింగ్ కంపెనీలు చేతిలో కీలు బొమ్మలా మారారని గోవింద రావు దుయ్య బట్టారు.రాము మతి తో భార్య, ఇద్దరు పిల్లలు దిక్కు లేని అ నాథులు గా మారారని పేర్కొన్నారు. మతి చెందిన రాము కుటుంబానికి రూ 50 లక్షల పరి హారం ఇచ్చేవరకు మత దేహాన్ని కదిలించేది లేదని గోవిందరావు, గిరిజన సంఘం నాయకులు గమ్మిన రాజు తదితరులు స్పష్టం చేశారు.

ప్రశంసా పత్రాన్ని ఇస్తున్న వెంకటేశ్వరరావు

బాక్సింగ్ పోటీల్లో మౌనికకు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక అల్లూరి సీతారామ రాజు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న బొంతు మౌనిక శుక్రవారం విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్‌లో పోటీల్లో స్వర్ణ పతకం గెలుపొందింది. ఈ పతకాన్ని ద్రోణాచార్య అవార్డ్ గ్రహీత ఐ వెంకటేశ్వరరావు అందజేశారు. కాలేజ్ ప్రిన్సిపాల్ రాజు, ఫిసికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు మౌనికను అభినందించారు. ఈ కార్యక్రమంలో శాప్ కోచ్ అబ్బు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి

14న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: డిసెంబర్ 14న దేశవ్యాప్తంగా నిర్వహించే నేషనల్ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, సివిల్ సీనియర్ జడ్జ్ షాద్ ఖాన్ మీడియాకు తెలియజేశారు. శనివారం ఆయన స్థానిక కోర్టు సముదాయంలో పోలీసు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులలో కక్షిదారులకు అగాహన కల్పించాలన్నారు. దీంతో సమయం, డబ్బు వృథా కాదన్నారు. ఈ సమవేశంలో ఎస్సీ మోహన్, బార్ ప్రెసిడెంట్ ప్రభాకర్, నర్సీపట్నం రూరల్ మరియు టౌన్ మాకవరపాలెం, నాతవరం ,రోలుగుంట, కోటవరట్ల, గోలుగొండ ,కేడీపేట పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

గృహ లబ్దిదారుల సమాచారం సేకరణ

విచారణ చేపడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-కోటవురట్ల: గత వైసిపి ప్రభుత్వంలో అందజేసిన ఇళ్ల పట్టాలు, కాలనీ ఇల్ల నిర్మాణాలు లబ్ది పొందిన అర్హుల సమగ్ర వివరాలను కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాలలో గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయం ఇంజనీర్లు, సిబ్బంది సమాచారం సేకరిస్తున్నారు. లబ్దిదారులు నిర్మాణాలు చేపట్టారా లేక వేరే వ్యక్తులకు అమ్ముకాలు చేపట్టారా, నిర్మించిన ఇళ్లలో నిజమైన లబ్దిదారులు ఉంటున్నారా అన్న విషయంపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు, జగనన్న ఇళ్ల స్థలాలు, అదేవిధంగా నిర్మాణాలలో వేరే చేతులు మారినట్లు ప్రభుత్వానికి అందిన నివేదిక మేరకు జిల్లా స్థాయి అధికారులు ఆదేశాలతో వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది, సమగ్ర సమాచారం సేకరించాలని ఇటీవల తహసిల్దార్ తిరుమల బాబు గ్రామస్థాయి అధికారులకు సమావేశం ఏర్పాటు చేసి వివరాలు సేకరించడంలో పూర్తి పారదర్శకంగా ఉండాలని క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం మాత్రమే నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆ మేరకు గడిచిన నాలుగు రోజులుగా విచారణ గ్రామస్థాయి అధికారులు చేపడుతున్నారు.

'నవోదయం'పై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ బి.మధుకుమార్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కృష్ణదేవిపేట గ్రామంలో నవోదయం పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాటు సారాతో కలిగే అనర్థాలను వివరించారు. నాటుసారా అమ్మడం, రవాణా చేస్తూ పట్టుబడిన వారికి చట్ట ప్రకారం శిక్ష తప్పదని చెప్పారు. గ్రామంలో ఎవరైనా నాటుసారా అమ్మితే సమాచారం ఇవ్వాలని చెప్పారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామబ్రహ్మం

విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 19, 20, 21 తేదీలలో నిర్వహించబడుతున్న విశాఖ బాలోత్సవం పోస్టర్‌ను తెలుగు భాషా కోవిదులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ గ్రహీత బేతవోలు రామబ్రహ్మం శనివారం తన గృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జివిఎస్.రాజేశ్వరరావు బాలోత్సవ కార్యక్రమ వివరాలను రామబ్రహ్మంకు వివరించారు. బాలోత్సవం సెయింట్ ఆంథోనీ ప్రైమరీ స్కూల్‌లో జరుగుతుందని తెలిపారు. 19న ఉదయం 10 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని రామబ్రహ్మాన్ని కోరారు. కార్యక్రమంలో విశాఖ బాలోత్సవం అధ్యక్షులు పి.రఘు, కమిటీ సభ్యులు సిహెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు.

వంటా వార్పు చేపడుతున్న నాయకులు

సెవెన్ హిల్స్ తీరుపై వంటా వార్పుతో నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ఎంజిఎం సెవెన్ హిల్స్ యాజమాన్యంపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ జిల్లా హాస్పిటల్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వంటా వార్పుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.రాజు మాట్లాడుతూ హాస్పిటల్‌లో పనిచేస్తున్న కార్మికుల పట్ల యాజమాన్యం తీవ్ర వేధింపులకు పాల్పడుతోందన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు దిగుతోందన్నారు. సంవత్సరాల తరబడి పని చేస్తున్న సీనియర్ కార్మికులను అర్ధాంతరంగా తొలగించడం దారుణమన్నారు. సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కె.చంద్రశేఖర్, కె.నరసింగరావు, కార్మికులు కె.వరలక్ష్మి, పిలోనెహా, ఎ.జయలక్ష్మి, సిహెచ్.వెంకటలక్ష్మి, ఎ.లావణ్య పాల్గొన్నారు.

సర్వే చేపడుతున్న సిబ్బంది

స్థల ఆక్రమణపై సర్వే

ప్రజాశక్తి -రావికమతం:మండలంలో చిన పాచిల చెరకు తూనిక కేంద్రం (గోవాడ షుగర్ ఫ్యాక్టరీ) చెందిన స్థలం ఆక్రమ పై శనివారం రెవిన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఈ మేరకు షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆదేశాల మేరకు ఏవో తమరాన కొండబాబు ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహించారు. గ్రామ సర్వే యర్ రవి సర్వే నిర్వహించగా సర్వే నెంబరు తొమ్మిదిలో ఎకరా 30 సెంట్లు గాను, 80 సెంట్లు స్థలం మాత్రమే ఉన్నట్లు తేలింది. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ స్టాఫ్ చిన్ని హరిహరరావు, పులగాయల సత్యనారాయణ, వేపాడ గంగరాజు , రైతులు జనాపాల వెంకట్రావు పాల్గొన్నారు.

తోపుడుబండ్ల కార్మికులపై దాడులు ఆపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తోపుడుబండ్ల కార్మికులపై జివిఎంసి అధికారులు, పోలీసులు చేస్తున్న దాడులు తక్షణమే ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం ఉదయం శివాజీపాలెం, పిఠాపురం కాలనీల్లో చిరు వ్యాపారుల దుకాణాలను, తోపుడు బండ్లను బుల్‌డోజర్ల, జెసిబిలతో పోలీసు పహారా మధ్య బలవంతంగా తొలగించడాన్ని ఖండించారు. ఎన్నో సంవత్సరాలుగా అక్కడే జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులపై దాడులు చేసి, వారి ఆస్తులను ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. చిరు వ్యాపారులకు అండగా ఉండాల్సిన వార్డు కార్పొరేటరే కక్ష కట్టి కోర్టుకు వెళ్లి చిరు వ్యాపారులపై దాడులు చేయడం అన్యాయమన్నారు. తోపుడు బండ్లు, చిరు వ్యాపారులకు న్యాయం జరిగే వరకూ సిఐటియు పోరాడుతుందని స్పష్టం చేశారు.

మూర్తి యాదవ్‌పై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ఎంవిపి.కాలనీ : జివిఎంసి 22వ వార్డులో చిరు వ్యాపారుల బడ్డీలను, తోపుడు బండ్లను తొలగించేందుకు స్థానిక జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ పూనుకోవడం అన్యాయమని, తక్షణమే ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. ఎవరూ లేని సమయం చూసి శనివారం వేకువజామున 4 గంటల సమయంలో పోలీస్ బలగాలతో జివిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులను రప్పించి అన్యాయంగా బడ్డీలను, తోపుడు బండ్లను తొలగించారన్నారు. మూర్తి యాదవ్ కుట్రలను వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎక్కడవారికి అక్కడే హాకర్‌జోన్ ఏర్పాటు చేయాలని, ఐడి కార్డులు ఇచ్చి ఉపాధి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తొలుత తోపుడు బండ్ల కార్మికులంతా మూర్తి యాదవ్ ఇంటికి నిరసన ర్యాలీగా వెళ్లారు. మూర్తి యాదవ్ ఎక్కడ దాగున్నాడో బయటకు రావాలని డిమాండ్ చేశారు. ఉపాధిని దెబ్బతీసిన మూర్తి యాదవ్ డౌన్ డౌన్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వ్యాయామ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పొద్యం హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు కుందూరు నూకరాజును శనివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాస్ మాట్లాడుతూ, నూకరాజు ఆటల పోటీల్లో ఎంతో మంది మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొనేలా ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారని, దీంతో ఈ సన్మాన కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పి.సత్తిబాబు, ఎస్ఎంసి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.